**నీలగిరి నిత్యపద్యం**

తెల్లవారగానే తేనీరు త్రాగగా
మధురమైన రుచియె మనుషులకును
గుప్పెడంత యెదకు కప్పెడు జాలండి
అలసటంతదీర్చి హాయినొసగు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక

RNI - TELTEL/2023/87644

**విలేకరులు కావలెను**

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

**పూర్తి వివరాలకు**

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.

సంచిక 43 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | ఆగస్టు 11, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


# సాగర్‌లో ముగిసిన వరుణయాగం

- పూర్ణాహుతిలో పాల్గొన్న రేవంత్ దంపతులు
- వేకువజామునే క్రతువు ప్రారంభించిన ఉత్తమ్ దంపతులు





**నాగార్జునసాగర్,ఆగస్టు 10 :** రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి జలాశయాలు నిండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం నాగార్జునసాగర్ వేదికగా 'మహా వరుణ యాగం' నిర్వహించింది. నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ విశిష్ట ఆధ్యాత్మిక క్రతువును చేపట్టారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు , వేదపండితుల ఆధ్వర్యంలో మిగతా2లో...



# మన కీర్తిపతాకను రెపరెపలాడించారు

**- కామన్‌వెల్త్ క్రీడాకారులకు ప్రధాని మోడీ అభినందనలు**

**న్యూఢిల్లీ,ఆగస్టు 10 :**దేశ కీర్తిపతాకను అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన క్రీడాకారులను ప్రధాని మోడీ అభినందించారు. మీ గెలుపు...మీకే కాదు..దేశానికి గర్వకారణ మని వారిని ప్రశంసించారు. భారత బాక్సర్ లవ్లీ నాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. కామన్వెల్త్ గేమ్స్‌లో పత కాలు సాధించిన అథ్లెట్లు ఆదివారం ప్రధానిని కలిసిన సంగతి తెలిసిందే. వారితో సరదాగా మాట్లాడిన మోదీ అథ్లెట్లకు లడ్డూలు తినిపించారు. ఈ సందర్భంగా బాక్సర్ లవ్లీనా.. గ్లాస్గోలో చేసిన పనిని ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. ఆ రెస్టరెంట్‌లో ఏం జరిగిందని మో ప్రశ్నించగా...అదేమీ చిన్న విషయం కాదని.. దేశమంతా సుదీర్ఘకాలం గుర్తు పెట్టుకుంటుందని లవ్లీనా మిగతా2లో...



## గ్లోబల్ హబ్‌గా తెలంగాణను ఇంధన రంగం అభివృద్ధి

**2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యం లక్ష్యం**

**అమెరికా పర్యటనలో డిప్యూటీ సిఎం భట్టి**

**హైదరాబాద్,ఆగస్టు 10 :**తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్క్లీలోని గోల్డ్‌మన్ స్కూల్ మిగతా2లో...

# అమిత్ షా వివరణ ఇవ్వాల్సిందే

- అప్పటి వరకు పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన తప్పదు
- హెచ్చరించిన ప్రియాంక, రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ,ఆగస్టు 10 :**పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వివరణ ఇవ్వాలని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ పట్టుబడుతోంది. ప్రకటన వచ్చేవరకు పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా తేల్చి చెప్పారు. సోమవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ప్రియాంక గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. 'కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటన ఇచ్చే వరకు పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన కొనసాగుతుంది' మిగతా2లో...




## తెలంగాణ కోసమే బతికిన పెద్ది

- ప్రజల అభిమానం చూరగొన్న నేత
- నర్సంపేట కాలేజీకి పెద్ది పేరు పెడతాం
- సంతాపసభలో కేటిఆర్ వెల్లడి

**నర్సంపేట,ఆగస్టు 10 :**ఎంతకాలం బతికి నం అనేది కాదు.. ఎట్లా బతికినం అనేది ముఖ్యం అని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవితమే అందుకు ఉదాహరణ అన్నారు. మిగతా2లో...



## బీసీలతో పాటు అన్ని కులాలకు సమాన అవకాశాలు

**రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉంది**

**స్వయం శక్తితో ఎదిగిన వ్యక్తి సర్వాయి పాపన్న**

**సచివాలయం ఎదురుగా మహనీయుల విగ్రహాలు ఏర్పాటు**

**పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి**

**హైదరాబాద్,ఆగస్టు 10 :** తెలంగాణలో బీసీలతో పాటు అన్ని కులాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ అన్నారు. సర్వాయి పాపన్న వంటి వీరుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న గొప్పతనాన్ని వివరిస్తూ మహేష్ కుమార్ మాట్లాడుతూ.. ఎంతో మంది రాజులు, చక్రవర్తులు చరిత్రలో ఉన్నప్పటికీ, చిన్న జాతిలో పుట్టి పోరాటంతో రాజుగా ఎదిగిన వ్యక్తి సర్వాయి పాపన్న అని అన్నారు. పుట్టుకతోనే చక్రవర్తులుగా మారిన వారితో పోలిస్తే, పాపన్న పోరాడి రాజ య్యారని పేర్కొన్నారు. మేము రాజులమే.. మిగతా2లో...

## ఆర్భాటంగా మండలాలు, రెవెన్యూ డివిజన్లు

**ఎక్కడా కార్యాలయ భవనాల నిర్మాణమేదీ**

**భూభారతితో రైతులకు భరోసా కల్పించిన ప్రజాప్రభుత్వం**

**గత బిఆర్ఎస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ పొంగులేటి**

**హుస్నాబాద్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు ప్రారంభం**



**హనుమకొండ,ఆగస్టు 10 :** రాష్ట్రవ్యాప్తంగా గత పాలకులు ఆర్భాటంగా అనేక డివిజన్లు, జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేశారని.. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అయితే వాటికి ఎక్కడ కూడా ఆఫీసులు, ఇతరత్రా సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.600 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 180 రెవెన్యూ తహశీల్దార్ కార్యాలయాలు, ఆర్డీవో మిగతా2లో...

## తెలంగాణలో ముగిసిన సర్ ప్రక్రియ

**- రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు**






## రిఫార్మ్ ఉత్సవ్‌పై కార్యాచరణ

**- ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్**

**హైదరాబాద్,ఆగస్టు 10 :** భారత ప్రభుత్వ కేబినెట్ కార్యదర్శి డా. టి.వి. సోమనాథన్ సోమవారం అన్ని రాష్ట్రాలప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం మిగతా2లో...

RNI - TELTEL/2023/87644
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక



# మన కీర్తిపతాకను రెపరెపలాడించారు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. కామన్వెల్త్ గేమ్స్‌లో మంచి ప్రదర్శన చేశాం. అది చివరి రోజు. చాలా సంతోషంగా గడపాల్సిన సందర్భం. అందుకోసం ఓ రెస్టరంట్‌కు వెళ్లాం. అయితే, మన మ్యాప్ సరిగా లేదని అనిపించింది. ఇదే విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లా. మార్పులు చేస్తామని చెప్పారు. సంబరాలు చేసుకుంటున్న సమయంలో మీరు మ్యాప్ ప్రాముఖ్యతను గుర్తించడం నిజంగా అభినందనీయం అని మోడీ అన్నారు.. ఆ వీడియో సాధారణమైంది కాదు. దేశ ప్రజలు సుదీర్ఘకాలం గుర్తుంచుకుంటారన్నారు. అసలేం జరిగిందంటే... గ్లాస్గోలోని ఓ రెస్టరెంట్‌కు లవ్లీనా తోపాటు కొందరు భారత అథ్లెట్లు డిన్నర్‌కు వెళ్లారు. అక్కడ ఉన్న హ్యాండ్ టవల్స్ పై భారత్ మ్యాప్ అసంపూర్తిగా ఉండటం లవ్లీనా గమనించింది. ఈశాన్య రాష్ట్రాలతోపాటు కశ్మీర్ పూర్తి భూభాగాలను ఆ చిత్రపటంలో చూపించక పోవడంతో సోషల్ మీడియా వేదికగా లవ్లీనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ తర్వాత రెస్టరంట్ క్షమాపణలు చెబుతూ ఓ ప్రకటనను జారీ చేసింది. అయితే, ఇది కావాలనే చేసిందని.. పొరపాటు కాదని అభిమానులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మరో బాక్సర్ నరేంద్ర బేర్వాల్ గతంలో తనకు పాక్ బాక్సర్‌తో ఎదురైన అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు. 'పాకిస్థాన్ గురించి ఏ మాట్లాడినా నాకొక స్టోరీ గుర్తుకొస్తుంది సర్. అది 2015 మిలిటరీ గేమ్స్. నా ఫస్ట్ ఫైట్ పాకిస్థాన్ బాక్సర్‌తోనే. అప్పుడు ఉన్నతాధికారులు, సహచరులు ఒకటే చెప్పేవారు. పాక్ బాక్సర్ చేతిలో మాత్రం ఓడిపోవద్దని అనేవారు. ఆ మ్యాచ్‌లో వరుసగా రెండు రౌండ్లలో నేనే గెలిచా. మీరు 2014లో ప్రధానిగా వచ్చారు. మా ఆర్మీ కోచ్ పేరు కూడా నరేందర్ రాణా. దానిని ఉద్దేశిస్తూ సదరు పాక్ బాక్సర్ 'బ్రదర్ నీతో ఓ విషయం చెప్పాలను కుంటున్నా' అని అన్నాడు. సరే చెప్పు అని బదులిచ్చా. 'నీ పేరు నరేందర్. మీ కోచ్ పేరు నరేందర్. మీ ప్రధాని నరేంద్ర. నాకు ఇప్పట్నుంచి ఈ పేరు అంటేనే ఇష్టం ఉండదు ఇక' అని అన్నాడు' అని బాక్సర్ చెప్పాడు. ఆ మాటలకు ప్రధాని మోదీ గట్టిగా నవ్వేశారు.

# అమిత్ షా వివరణ ఇవ్వాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

అని అన్నారు. ఢిల్లీ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమాధానం చెప్పి తీరాల్సిందేనని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులపై దాడి ఘటనపై ప్రకటన ఇవ్వడానికి ఆయన పార్లమెంట్‌కు రావాల్సిందేనని పట్టుబట్టారు. పోలీసుల దాడిలో యువతులు, మైనర్లు గాయపడ్డారని అన్నారు. కాల్పులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన దాడిపై ఎందుకు మౌనంగా ఉంటున్నారంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఈ 'నేరం'పై ఆయన సమాధానం చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రయాగ్‌రాజ్‌లో శనివారం జరిగిన 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో ఓ విద్యార్థి నీట్‌కు సన్నద్ధమైన తాను సర్వం కోల్పోయానని, తనకు ఏ అవకాశాలు మిగల్లేదని ఆవేదనతో తెలిపాడని రాహుల్ వెల్లడించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద విద్యార్థుల ఆందోళన ముగిసి చాలా రోజులవుతునప్పటికీ ఇప్పటి వరకూ వారిపై పోలీసుల దాడికి సంబంధించి అమిత్ షా నోటి నుంచి ఒక్క మాట కూడా పెగల్లేదని రాహుల్ విమర్శించారు. మరోవైపు విద్యార్థులకు క్షమాపణ చెప్పడానికి బదులు వారిని క్షమిస్తున్నానంటూ ప్రధాని మోదీ తీరిక లేకుండా ఉన్నారని ఆక్షేపించారు.

# గ్లోబల్ హబ్‌గా తెలంగాణను ఇంధన రంగం అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

ఆఫ్ పబ్లిక్ పాలసీ పరిధిలోని 'ఇండియా ఎనర్జీ ,క్లైమేట్ సెంటర్'ను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో భారతదేశ పునరుత్పాదక ఇంధన లక్ష్యాల సాధనతో పాటు తెలంగాణను స్వచ్ఛ ఇంధన రంగాన గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన భవిష్యత్ ప్రణాళికలపై లోతుగా చర్చించారు. భారతదేశం నిర్దేశించుకున్న 2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యా న్ని అందుకునేందుకు అవసరమైన వ్యూహాలు, తగ్గుతున్న శుద్ధ సాంకేతికత ఖర్చులు తెచ్చిపెడుతున్న నూతన అవకాశాలను ఈ సమావేశంలో పరిశీలిం చారు. గ్రిడ్ ఆధునీకరణ, పారిశ్రామిక డీకార్బనైజేషన్, ఆధునిక బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థల సమన్వయం , సమాన అవకాశాలతో కూడిన శక్తి పరివర్తన మార్గాలపై పరిశోధకులు, అధికారులతో డిప్యూటీ సీఎం విస్తృతంగా ఆలోచనలు పంచుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం చేపట్టిన వినూత్న పునరుత్పాదక ఇంధన మోడల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పారదర్శకమైన హరిత విధానం ద్వారా గ్రీన్ ఎనర్జీ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ రాష్ట్రంలో సౌరశక్తి సహా ఇతర పునరుత్పాదక సామర్థ్యాన్ని వేగవంతంగా విస్తరిస్తున్న తీరును డిప్యూటీ సీఎం వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో సోలార్ ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టడం, పీఎం-కుసుమ్ పథకం ద్వారా అన్నదాతలకు స్వచ్ఛ ఇంధనాన్ని అందించడం వంటి ప్రజాకేంద్రిత నమూనాలు అంతర్జాతీయ ప్రతినిధుల ప్రశంసలు అందుకున్నాయి. 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు క్లీన్-టెక్ పరికరాల తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్న తీరును ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు. సిలికాన్ వ్యాలీ ఆవిష్కరణలు, కాలిఫోర్నియా రాష్ట్ర ఇంధన రంగానుభవాలను ఉపయోగించుకుని తెలంగాణలో సరికొత్త ఇంధన విప్లవానికి శ్రీకారం చుట్టాలని ఈ భేటీలో నిర్ణయిం చారు. విద్యుత్, రవాణా, పారిశ్రామిక , వాతావరణ స్థిరత్వ రంగాలలో సంయుక్త అధ్యయనాలు చేపట్టడం, విధాన నిర్ణేతలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో ఇంధన భద్రతను, ఆర్థిక పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు యూసీ బర్క్లీ ప్రతినిధులతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

# రిఫార్మ్ ఉత్సవ్‌పై కార్యాచరణ

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదించిన 'రిఫార్మ్ ఉత్సవ్ కార్యక్రమం అమలు, కార్యాచరణపై రాష్ట్రాలకు వివరించారు. అక్టోబర్ 2026 నుంచి రిఫార్మ్ ఉత్సవ్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు కేబినెట్ కార్యదర్శి తెలిపారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలను సేకరించి, వాటిని ఆచరణాత్మక సంస్కరణలుగా మార్చి, నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికతో అమలు చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రిఫార్మ్ ఉత్సవ్‌ను మూడు దశల్లో అమలు చేయనున్నారు. మొదటి దశగా ఆగస్టు-సెప్టెంబర్ 2026లో సన్నాహక కార్యక్రమాలు చేపట్టనున్నారు. పరిపాలనా వ్యవస్థ ఏర్పాటు, అధికారుల సెన్సిటైజేషన్, ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు ఉంటాయి. రెండో దశ అక్టోబర్-డిసెంబర్ 2026లో రిఫార్మ్ ఉత్సవ్గా నిర్వహించనున్నారు. ఇందులో జన్ మంథన్ కార్యక్రమం అక్టోబర్ 1 నుంచి 31 వరకు, విమర్శ్ జన్ సమాధాన్ కార్యక్రమాలు అక్టోబర్ 10 నుంచి నవంబర్ 30 వరకు నిర్వహించి, త్వరితగతిన అమలు చేయగల సంస్కరణలు, మధ్యకాలిక సంస్కరణలపై దృష్టి సారించనున్నారు. సంకల్ప సిద్ధి కార్యక్రమం అక్టోబర్ 10 నుంచి డిసెంబర్ 20 వరకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్నారు. మూడో దశగా డిసెంబర్ 28, 2026 నుంచి తదుపరి చర్యలు చేపట్టనున్నారు. ఇందులో నిర్మాణాత్మక సంస్కరణలపై నిరంతర పర్యవేక్షణ, తదుపరి చర్యలు మరియు సమర్పణ ఉంటాయి. రిఫార్మ్ ఉత్సవ్ అమలుకు ప్రతి రాష్ట్రంలో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన స్టేట్ కోఆర్డినేటివ్ కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు స్టేట్ నోడల్ ఆఫీసర్ ను, జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించనున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు నవీన్ మిట్టల్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ కోసమే బతికిన పెద్ది

(మొదటి పేజీ తరువాయి)

వరంగల్ జిల్లా నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభకు హరీశ్ రావుతో కలిసి హాజరయ్యారు. పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రకు వేలాది మంది తరలివచ్చారు.లక్షకు పైగా మంది 12 గంటల పాటు వర్షం పడుతున్నా ఎక్కడికి వెళ్లకుండా అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన ఎలాంటి వ్యక్తో తెలుపడానికి ఇదే నిదర్శనమన్నారు. పెద్ది కోరుకున్నట్లు వచ్చే రెండేండ్లలో అధికారంలోకి వస్తామన్నారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సంపేటలోని మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతామన్నారు. భవిష్యత్ తరాలు గుర్తు చేసుకునే విధంగా ఘన నివాళులు అర్పిద్దామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని ఒంటిచేత్తో నడిపిన నాయకుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అని బీఆర్ఎస్ కేటీఆర్ అన్నారు. ప్రజల్లో సుదర్శన్‌రెడ్డి పట్ల ఉన్న గౌరవం.. ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నవారి సంఖ్యను చూస్తే తెలుస్తోందని చెప్పారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో నిర్వహించిన పెద్ది సుదర్శన్ సంస్మరణ సభలో కేటీఆర్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా పెద్ది సుదర్శన్‌రెడ్డి భారీ ఎత్తున నిర్వహించేవారు. ఆయన్ను బతికించుకునేందుకు ఎంత ప్రయత్నం చేయాలో అంతా చేశాం. ఎవరైనా ఎంతకాలం బతికామన్నది ముఖ్యం కాదు.. ఎలా బతికామన్నదే ముఖ్యం. ఎమ్మెల్యేగా ఒక్కసారి గెలిచినా.. జనం గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా ఆయన పనిచేశారు. నర్సంపేటలో నిర్మించే మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెడతాం. ఆయన కుటుంబాన్ని కాపాడుకునే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా సాగిన పోరాటం, తెలంగాణ అనంతరం నర్సంపేట ఎమ్మెల్యే గా పెద్ది చేసిన శాశ్వత పనులపై చేసిన డాక్యుమెంట్ ప్రదర్శన పలువురిని కంటతడి పెట్టించింది. డాక్యుమెంటరీ చూసి పెద్ది భార్య స్వప్న కన్నీరుమున్నీరైంది. కార్యక్రమంలో శాసన మండలి విపక్షనేత సిరికొండ, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, మాజీ మంత్రి ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేష్, గండ్ర సహా పలువురు నేతలు హాజరయ్యారు.

# తెలంగాణలో ముగిసిన సర్ ప్రక్రియ

**హైదరాబాద్,ఆగస్టు 10:** తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యూమరేషన్ ..సర్ పక్రియ ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. తెలంగాణలో 73,95,954 మంది ఓటర్లను తొలగించినట్లు సమాచారం. ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పక్రియ పూర్తయ్యింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ నమోదైంది.అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 94.30 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. ఆ తర్వాతి స్థానాల్లో మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతంతో ఉన్నాయి. ఇక, హైదరాబాద్ 27,74,687 ఎన్యూమరేషన్ ఫారాలతో 58.58 శాతం డిజిటలైజేషన్ పూర్తై చివరి స్థానంలో నిలిచింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతం, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 89.45 శాతం, జగిత్యాల జిల్లాలో 89.60 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. రెండు సార్లు గడువు పొడిగించినప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ శాతం పెరగలేదు. కాగా, తెలంగాణలో సర్ పక్రియ పూర్తయినట్లు ఈనెల 12న సీఈవో ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే, ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానున్నట్లు సమాచారం. ఆ తర్వాత నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది.

# బీసీలతో పాటు అన్ని కులాలకు సమాన అవకాశాలు

(మొదటి పేజీ తరువాయి)

మేము కూడా పాలించగలుగుతాం అనే ఆత్మవిశ్వాసాన్ని పేద, వెనుకబడిన వర్గాల్లో కల్పించిన గొప్ప వ్యక్తి సర్వాయి పాపన్న అని మహేష్ కుమార్ అన్నారు. పేద వర్గాల కోసం పాపన్న పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కుల పెద్దలతో చర్చించి సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మహేష్ కుమార్ తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కూడా మాట్లాడినట్లు చెప్పారు. సెక్రటేరియట్ ముందు సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని వెల్లడించారు. విగ్రహాలు కేవలం పూలమాలలు వేసేందుకు మాత్రమే కాదని, ఆయా మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగేందుకే విగ్రహాలను ఏర్పాటు చేయాలని మహేష్ కుమార్ అన్నారు. సామాజిక సంస్కర్తలు జ్యోతిబా ఫూలే, సావిత్రిబాయి ఫూలే విగ్రహాలను కూడా ఆవిష్కరించనున్నట్లు మహేష్ కుమార్ తెలిపారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలు, మహిళలు, పేదల కోసం పోరాడిన మహనీయుల స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.రాజకీయాలకు అతీతంగా రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారని మహేష్ కుమార్ పేర్కొన్నారు. ఎవరు ఎంతో.. వారికి అంత అనేది రాహుల్ గాంధీ నినాదమని తెలిపారు. అదే నినాదంతో తెలంగాణలో కులగణన చేపట్టామని అన్నారు. రాష్ట్రంలో కులగణనకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయని చెప్పారు. అయితే అసెంబ్లీలో కులగణనకు మద్దతు ఇచ్చిన బీజేపీ.. కేంద్ర స్థాయిలో మాత్రం దానిని అడ్డుకుంటోందని విమర్శించారు. బీసీలు తమ హక్కుల కోసం పోరాడితే కొందరు దానిని ఇతరులకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంగా చిత్రీకరిస్తున్నారని మహేష్ కుమార్ అన్నారు. మా హక్కుల కోసం మేము పోరాడితే.. మాకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని అంటున్నారు. మేము ఎవరికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. అన్ని కులాలను కలుపుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. తమ కులం నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని తెలిసినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు మద్దతు ఇచ్చారని, కులగణన చేపట్టారని పేర్కొన్నారు. ఎవరినీ ఇబ్బందులకు గురి చేయకుండా అన్ని కులాలను కలుపుకుని సమాన అవకాశాలతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. మంత్రిగా ఉన్న సమయంలో శ్రీనివాస్ గౌడ్ పార్టీలకు అతీతంగా బీసీల కోసం, కులాల సంక్షేమం కోసం పనిచేశారని మహేష్ కుమార్ పేర్కొన్నారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బీసీలతో పాటు ఇతర కులాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని రాహుల్ గాంధీ సూచించారని తెలిపారు. ఈ క్రమంలో పార్టీ పదవుల్లో కూడా సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. 79 శాతం ఉపాధ్యక్ష పదవులను బీసీలకు ఇచ్చామని, అదే సమయంలో అన్ని కులాలకు సమానంగా అవకాశాలు కల్పించామని మహేష్ కుమార్ వెల్లడించారు. కులాల హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, గౌరవం లభించేలా ముందుకు సాగడమే లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు.

# సాగర్‌లో ముగిసిన వరుణయాగం

(మొదటి పేజీ తరువాయి)

108 మంది రుత్వికులు 11 హోమగుండాలతో ఈ మహా యాగాన్ని శాస్త్రోక్తంగా పూజలు జరిపి పూర్తి చేశారు. ఈ వరుణ యాగంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొని హోమగుండంలో పూర్ణాహుతి సామాగ్రిని సమర్పించారు. కృష్ణా, గోదావరి నదులు జలకళను సంతరించుకోవాలని, రాష్ట్రంలోని చెరువులు , రిజర్వాయర్లు నిండి పంటలు సమృద్ధిగా పండాలని సీఎం దంపతులు వరుణ దేవుడిని ప్రార్థించారు. ఈ క్రతువులో పలువురు ప్రజాప్రతినిధులు , అధికారులు పాల్గొనగా, శాస్త్రోక్తంగా నిర్వహించిన మహాపూర్ణాహుతితో ఈ వరుణ యాగం ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి రాష్ట్రం పాడిపంటలతో విలసిల్లాలని కాంక్షిస్తూ.. ప్రభుత్వం వరుణయాగం నిర్వహిస్తోంది. సోమవారం తెల్లవారుజామున ఆదిపూజ నిర్వహించి యాగ క్రతువును ప్రారంభించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దంపతులు ఈ యాగంలో పాల్గొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మాజీమంత్రి జానారెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు యాగ క్రతువులో పాల్గొన్నారు.

# ఆర్భాటంగా మండలాలు, రెవెన్యూ డివిజన్లు

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయాలను యుద్ధ ప్రాతిపదికన సంవత్సరంలోపు పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలోని ఎల్కతుర్తిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ధరణిని బంగాళాఖాతంలో వేశామని.. భూభారతి చేపట్టి రైతులకు పూర్తి భద్రత, భరోసా ఇచ్చేలా భూములను ప్రక్షాళన చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి రెవెన్యూ విలేజ్‌లోని ప్రతి అంగుళాన్ని సర్వే చేసి మనిషికి ఎలాగైతే ఆధార్ ఉందో, భూములకు కూడా భూధార్ ఇస్తామని చెప్పారు. రైతులందరి సహకారంతో భూముల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఒక భద్రత, భరోసా కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.రైతన్నల దీవెనలతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అన్నదాతను రాజు చేయడమే తమ లక్ష్యమని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. గడిచిన రెండున్నరేండ్లలో వేల కోట్లు రైతన్నల కోసం ఖర్చు చేశామని, కనీవినీ ఎరగని విధంగా పంటలు పండించామని ఆయన తెలిపారు. గతంలో సేకరించిన ధాన్యాన్ని స్టోర్ చేసే కెపాసిటీ లేకపోయినా.. చివరి గింజ వరకు కొంటామన్న ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని గుర్తుచేశారు. హనుమ కొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరులో లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రైతులకు సంకెళ్లు వేసి, వరి వేస్తే ఉరి అన్న బీఆర్ఎస్ నాయకులు.. నేడు ధాన్యం కొనుగోళ్లపై రాజకీయం చేస్తూ పాదయాత్రలతో తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదని, పదే పదే ఈ మాట చెప్పడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదని.. పదేండ్లు రాష్ట్రాన్ని దోచుకున్న వారే నేడు గోబెల్స్ ప్రచారాలు చేస్తూ ఎద్దేవా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మజ్లిస్‌కు కొమ్ముకాస్తున్న రంగనాథ్

- **నాదర్‌గుల్ ఆక్రమణలపై చర్యలు తీసుకుని హైడ్రా**
- **మీడియాతో చిట్‌చాట్‌లో రాంచంద్రరావు విమర్శలు**

**హైదరాబాద్,ఆగస్టు 10 :** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మరోసార్ హాట్ కామెంట్స్ చేశారు. హైకోర్టు చెప్పినా రంగనాథ్ తీరు మారడం లేదని వ్యాఖ్యానించారు. సోమవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. రంగనాథ్‌కు మజ్లీస్ మీదున్న ప్రేమ.. ప్రజల మీద లేదని విమర్శించారు. కోర్ట్‌ను తప్పుదోవ పట్టిస్తూ కాలయాపన చేయడం సరికాదన్నారు. నాదర్‌గుల్‌లో చాలా ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా ఎందుకు పరిరక్షించడం లేదని ప్రశ్నించారు. అక్కడ ఎన్నో ఎకరాల భూమిలో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని తెలిపారు.

వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడామని చెబుతున్న హైడ్రా.. మరి ఆ భూములను ఎక్కడ దాచిపెట్టారని.. ఎందుకు ప్రజల ముందు ఉంచడం లేదని నిలదీశారు. పరిపాలనలో లోపంతోనే అధికారులపై ఆరోపణలు వస్తున్నాయని రామచందర్‌రావు విమర్శించారు. సల్కమ్ చెరువులో అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కోర్టులను కూడా అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. న్యాయస్థానాల ఆదేశాలున్నా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ భూములను ఎవరు కబ్జా చేసినా చూస్తూ ఊరుకోం. క్యూర్‌పై ఆగస్ట్ 15 తర్వాత భాజపా ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహిస్తాం. ఆ తర్వాత ఉద్యమాలు ఉద్ధృతం చేస్తాం. భాజపా రాష్ట్ర అధ్యక్షుడిని రెండేళ్ల తర్వాత తప్పకుండా మారుస్తారు. ఎస్ఐఆర్ పక్రియ ముగిసిన తర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికలు ఉంటాయని అనుకుంటున్నాం. ఇథనాల్‌తో వాహనాల ఇంజిన్‌లు పాడైపోతాయని ఇండియా కూటమి తప్పుడు ప్రచారం చేస్తోందని రామచందర్‌రావు అన్నారు.

# మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి కలవేన శంకర్



**గన్నేరువరం, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో దేశాన్ని నడుపుతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ ఆరోపించారు.సిపిఐ ప్రచార జాతా ఐదవ రోజు గన్నేరువరం మండలంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ రైతు వ్యతిరేక చట్టాలపై దేశవ్యాప్తంగా జరిగిన పోరాటాల్లో 750 మందికి పైగా రైతులు ప్రాణాలు కోల్పోయారని, కనీస మద్దతు ధర చట్టం అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో, మహిళా రిజర్వేషన్ అమలు చేయడంలో, కార్మిక హక్కులను రక్షించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. విద్య, వైద్యం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అందనంత దూరంలో ఉన్నాయని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస సదుపాయాలు లేవని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆయన అన్నారు. దేశంలో మార్పు అవసరమని, సెప్టెంబర్ 1న ఢిల్లీలో జరిగే సిపిఐ బహిరంగ సభలో పెద్ద ఎత్తున పాల్గొని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు.సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని బీజేపీ ప్రభుత్వం కూలదోస్తోందని, పౌరులకు కల్పించిన హక్కులు అమలు చేయడంలేదని, పేదలకు కూడు, గుడ్డ, నీడ కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు.కార్యక్రమంలో సిపిఐ నాయకులు, మండల కార్యదర్శులు, ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీరామ హృదయ కలశ యాత్ర



**అమ్రాబాద్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం ఏమి రెడ్డిపల్లి గ్రామంలో సోమవారం శ్రీరామ హృదయ కలశ యాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్రలో గ్రామ భక్తులు భజనలు, నామస్మరణలతో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కలశంలో భక్తులు తమ ఇళ్ల నుండి తెచ్చిన బియ్యాన్ని శ్రీరామ జయరామ జయ జయ రామ నామ స్మరణతో సమర్పించారు. ఈ బియ్యం అయోధ్యలో నిర్మిస్తున్న శ్రీరామ మందిరానికి పంప నున్నారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త పాపిశెట్టి అశోక్ కుమార్, గ్రామ కమిటీ సమన్వయకర్త బలరాం, కమిటీ కార్యదర్శి నిరంజన్ వికాస్, సభ్యులు రామనాథం, వీరస్వామి తో పాటు మహిళా భక్తులు పాల్గొన్నారు.చివరగా ప్రసాద వితరణ జరగగా, వాతావరణం అంతా రామనామంతో మారుమోగింది.

## వారసుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా బాలసాని వెంకటేశం నియామకం



**పెద్దపల్లి, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పెద్దపల్లి జిల్లా నాయకుడు బాలసాని వెంకటేశం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల అడుగుజాడల్లో నడుస్తూ సమాజంలో క్షీణిస్తున్న దేశభక్తిని పెంపొందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే సమరయోధుల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు.తన ఎన్నికకు సహకరించిన ఫ్రీడం ఫైటర్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వున్నం వెంకయ్య, వారసుల సంఘం అధ్యక్షుడు మాల్ రెడ్డి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి సింగ్ రమేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలపై కార్మిక సంఘాల ఆగ్రహం



**పెద్దపల్లి, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త పిలుపు మేరకు పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జైల్ భరో కార్యక్రమం జరిగింది. సిటియు, ఐఎఫ్‌టియు, ఏఐకెఎంఎస్, పంచాయతీ రాజ్, అంగన్వాడి, ఆశ, మున్సిపల్ సంఘాలకు చెందిన కార్మికులు, ప్రజలు వందలాదిమంది పట్టుదలతో పాల్గొన్నారు. వ్యవసాయ మార్కెట్ నుంచి ప్రదర్శనగా బయలుదేరి అంబేద్కర్ విగ్రహం వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం పోలీసులు జోక్యం చేసుకొని రాస్తారోకోను విచ్ఛిన్నం చేసి సిటియు నాయకులు ముత్యం రావు, రవిని అరెస్టు చేశారు.ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు ఐ. కృష్ణ, సిటియు జిల్లా అధ్యక్షులు ముత్యం రావు, విజయలక్ష్మి, రవి మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం పరిశ్రమలను ప్రైవేటుపరం చేస్తూ కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్పొరేట్ అనుకూల విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. రైతాంగాన్ని దెబ్బతీయడానికి విద్యుత్ చట్టం, వాణిజ్య ఒప్పందాలు తీసుకువస్తున్నారని, దేశంలో ధరలు, నిరుద్యోగం పెరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. అశోక్, ఏఐకెఎంఎస్ నాయకుడు ఐ. రాజయ్య, పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరు మూల తిరుపతి, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకుడు లింగమూర్తి, మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకుడు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపిన బీఆర్ఎస్ నాయకులు



**గంగాధర, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంనారాయణపూర్ గ్రామంలో గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ప్రారంభించిన రిలే నిరాహార దీక్షలకు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త జైపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం నారాయణపూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులపై తప్పుడు కేసులు పెట్టి భయాందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ముంపు గ్రామంగా ప్రకటించేంతవరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ మాట్లాడుతూ గ్రామస్తులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, లేకపోతే ఆమరణ నిరాహార దీక్షకు వెళ్తామని హెచ్చరించారు.గ్రామస్తుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని ఇద్దరు నాయకులు స్పష్టం చేశారు.

## కార్పొరేటర్ రవీందర్ చొరవతో కోతుల పట్టివేత



**కరీంనగర్ రూరల్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నాలుగవ డివిజన్ గోపాల్పూర్‌లో గ్రామంలో విధ్వంసం సృష్టిస్తున్న 59 కోతులను అధికారులు పట్టుకున్నారు.కార్పొరేటర్ భూపతి రవీందర్ అభ్యర్థన మేరకు ఎనిమల్ ఇన్స్పెక్టర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో కోతులను బంధించి జన్నారం అడవులకు తరలించారు.

## క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జైల్ భరో కార్యక్రమం



**మర్రిగూడ, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని చౌరస్తాలో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో జైల్ భరో కార్యక్రమం జరిగింది. నాడు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేడు కార్పొరేట్ పెట్టుబడిదారులు, మతోన్మాద శక్తుల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున పిలుపునిచ్చారు.ఆయన మాట్లాడుతూ, "కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ అమలు, విద్యుత్ సవరణ బిల్లు--2025, విత్తన చట్ట సవరణలు పెట్టుబడిదారులకు అనుకూలంగా తీసుకొస్తోంది. కార్మికులు సాధించిన 8 గంటల పని హక్కు, సమ్మె హక్కు, ఉద్యోగ భద్రత వంటి హక్కులను లేబర్ కోడ్స్ ద్వారా కాలరాస్తోంది" అని విమర్శించారు.అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసి, పీఎఫ్, ఈఎస్ఐ, వెల్ఫేర్ బోర్డులపై కోతలు విధిస్తున్నారని, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, ఐకేపీ, వీఏఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కోట్లాది మంది కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో ప్రజలు ఉపాధి హామీ పనులపై ఆధారపడుతున్నారని, అయితే కేంద్రం తీసుకొస్తున్న కఠిన నిర్ణయాల వల్ల పథకం నీరుగారిపోతోందని పేర్కొన్నారు. "ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించి, సంవత్సరానికి కనీసం 200 రోజుల పని కల్పించాలి. రైతులకు పంటలకు గిట్టుబాటు ధర, వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి" అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్పుల యాదయ్య, మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దామెర లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నీలకంఠం రాములు, రైతు సంఘం కార్యదర్శి ఏరుకొండ రాఘవేంద్ర, మైల సత్తయ్య, అమాలి వర్కర్స్ నాయకులు పళ్ళ నరసింహ, ఒట్టికోటి పాండు, చేతివృత్తిదారుల సంఘం జిల్లా నాయకుడు సలువోజు రామలింగాచారి, అంగన్వాడీ వర్కర్స్ నాయకులు లక్ష్మి, మట్టం భాగ్యమ్మ, జంపాల వసంత, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు చిలువేరు లింగయ్య, గ్రామపంచాయతీ వర్కర్స్ నాయకుడు సిలువేరు మహేష్, ఎలక్ట్రిషన్ యూనియన్ నాయకుడు కర్నాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండలో ఏఐవైఎఫ్ జిల్లా మహాసభల కరపత్ర ఆవిష్కరణ



**దేవరకొండ, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** డిండి మండల కేంద్రంలోని సిపిఐ ప్రజాభవన్‌లో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నల్లగొండ జిల్లా 15వ మహాసభల కరపత్రాన్ని జిల్లా ఉపాధ్యక్షుడు ఎనమల్ల నవీన్ ఆవిష్కరించారు.ఆయన మాట్లాడుతూ, "ఆగస్టు 13 గురువారం మునుగోడు నియోజకవర్గంలోని సత్య ఫంక్షన్ హాల్‌లో మహాసభలు జరుగుతాయి. ప్రతి నాయకుడు, కార్యకర్త తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలి" అని పిలుపునిచ్చారు.యువత దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తుందని, ప్రగతిశీల భావాలు, దేశభక్తి, ప్రజాస్వామ్య విలువలు, మానవత్వాన్ని నిలబెట్టేందుకు ఏఐవైఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. భగత్‌సింగ్, రాజుగురు, సుఖ్‌దేవ్, చంద్రశేఖర్ ఆజాద్, సుభాష్ చంద్రబోస్ వంటి అమరవీరుల వారసత్వాన్ని పునికిపుచ్చుకొని స్వాతంత్ర్య ఉద్యమంలో యువతను సమీకరించినట్లు గుర్తుచేశారు.కేంద్ర ప్రభుత్వం యువతను మోసం చేస్తోందని, ఉద్యోగాల హామీలు గాలిలో కలిసిపోయాయని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ నిరుద్యోగ సమస్యను మరింత పెంచుతోందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల ప్రజలు భారంతో నలుగుతున్నారని, విద్యారంగాన్ని కాషాయకరణ చేస్తూ పోటీ పరీక్షల్లో ఘోర వైఫల్యాలు చోటుచేసుకుంటున్నాయని ఆయన అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఇప్పటివరకు 55,143 ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసిందని, రాజీవ్ యువ వికాసం పథకంలో 5 లక్షల మంది యువత దరఖాస్తు చేసినా రుణ సదుపాయం ఇవ్వలేదని విమర్శించారు. వెంటనే నిధులు విడుదల చేసి యువతను ఆదుకోవాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ డిండి మండల అధ్యక్షుడు కాంపల్లి ప్రవీణ్, కార్యదర్శి ఎలిమినేటి నరేష్, కోశాధికారి నాయక్ మధుకర్, ఉపాధ్యక్షుడు నూనె భూపాల్, మాజీ అధ్యక్షులు ఆర్కపల్లి మహేష్, దేగ అనిల్, నాగార్జున్, నూతనగంటి అంజి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ప్రభుత్వశీ కార్పొరేట్ అనుకూల విధానాలుమానుకోవాలి

**- లేకపోతే మోడీని గద్దె దించుతాం**



**నిడమనూర్, ఆగస్టు 10(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలు మానుకోకపోతే మోడీ ప్రభుత్వాన్ని ప్రజలే గద్దె దింపుతారని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చిన్నపాక లక్ష్మీనారాయణ, కెవి పిఎస్ జిల్లా అధ్యక్షులు కొండేటి శీను లు హెచ్చరించారు.సోమవారం సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల, జాతీయ కమిటీ ల పిలుపుమేరకు జైల్ బరో కార్యక్రమంలో భాగంగా నిడమనూర్ మండల కేంద్రంలోరాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో చేస్తున్న నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. సందర్భంగా ప్రజలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ అనేక వాగ్దానాలు చేసి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని నరేంద్ర మోడీ సర్కార్ కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని విమర్శించారు. దేశానికి అన్నం పెట్టే అన్నదాతలు కనీస మద్దతు ధరల చట్టం చేయాలని స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని పోరాడుతుంటే అవి పట్టించుకోకుండా వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పి దేశ ప్రజల ఆహార భద్రతకు ముప్పు తెచ్చే విత్తన చట్టాన్ని తేవడం,విద్యుత్ సవరణ చట్టం పేరుతో ప్రజలపై భారాల మోపే చర్యలు మానుకోకపోతే భారత రైతాంగం మోడీకి తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. వందేళ్ళ క్రితం కార్మిక వర్గం తమ రక్తాన్ని చిందించి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మిక హక్కులను హరించే 4 లేబర్ కోడ్స్ తెచ్చిందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టం ద్వారా ఈ దేశంలో 30 కోట్ల మంది వ్యవసాయ కార్మికులకు అంతో ఇంతో ఆసరాగా ఉన్న చట్టాన్ని రద్దుచేసి వ్యవసాయ కార్మికుల ఆకలి తో చంపే విబిజి రాంజీ చట్టం తేవడం ఏం న్యాయమని ప్రశ్నించారు. 79 ఏండ్ల స్వతంత్ర భారతదేశంలో ప్రజల రెక్కల కష్టంతో నిర్మించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను స్వదేశీ విదేశీ కార్పొరేట్ వ్యక్తులకు కారు చౌకగా అమ్ముతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యం లౌకిక విలువలకు గోరి కట్టే విధంగా బిజెపి పాలన ఉందని విమర్శించారు. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు నిరుద్యోగం కార్మికుల నిజ వేతనాలు పడిపోతూ ప్రజల అల్లాడుతుంటే మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చులు పెడుతూ ప్రజల భావోద్వేగాలతో రాజకీయాలు చేస్తుందని వీటిపట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోకపోతే రాబోయే కాలంలో మరిన్ని పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధమవుతుందని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి కోటేష్, సిఐటియు మండల కన్వీనర్ కోమండ్ల గురువయ్య, రైతు సంఘం మండల అధ్యక్షులు నడ్డి నాగరాజు, ప్రజాసంఘాల నాయకులు ఆకారపు నరేష్, మల్లీ కంటి చంద్రశేఖర్, వింజమూరి శివ, కుంచెం శేఖర్,వెంపటి మహేష్, ముత్యాల కేశవులు, గుత్తా శ్రీనివాస్ రెడ్డి,బొడ్డు లింగయ్య, శ్యామల రాజేష్, చిత్రం శ్రీను, కందుల పరమేష్, వెంకటమ్మ, సైదమ్మ, మేరమ్మ, సాంబయ్య, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

# జైల్ భరో సందర్భంగా నిరసన ర్యాలీలు



**నల్లగొండ, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో జైల్ భరో కార్యక్రమం జరిగింది. సుభాష్ విగ్రహం నుండి పెద్ద గడియారం వరకు నిరసన ర్యాలీ నిర్వహించిన కార్యకర్తలను కలెక్టర్ బంగ్లా దగ్గర పోలీసులు అరెస్టు చేసి, అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.డి. సలీం, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండెంపల్లి సరోజ మాట్లాడుతూ, "ప్రజా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ బిల్లు--2025 వంటి నిర్ణయాలను తక్షణమే వెనక్కి తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు.కార్మికులను నోటీసు లేకుండా తొలగించే "హైర్ అండ్ ఫైర్" విధానాన్ని రద్దు చేయాలని, మహిళా కార్మికుల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరారు. రైతులకు గిట్టుబాటు ధర, సాగునీరు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఉపాధి హామీ పనులను విస్తరించి కనీసం 200 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో అవాజ్ జిల్లా కార్యదర్శి సయ్యద్ హాశం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు దండెంపల్లి సత్తయ్య, జిల్లా సహాయ కార్యదర్శి అవుట్ రవీందర్, రైతు సంఘం నాయకులు నలపరాజు సైదులు, పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి కొండా అనురాధ, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ, గంజి రాజేష్, కత్తుల యాదయ్య, అలాగే సుంకర బోయిన వెంకన్న, సాగర్ల మల్లయ్య, పేర్ల సంజీవ, గౌరీదేవి, మధుసూదన్, కట్ట అంజయ్య, కందే యాదగిరి, బొల్లు రవీందర్, ఉప్పల గోపాల్, ఔరేసు మారయ్య, చల్ల యాదయ్య, పజ్జూరు యాదగిరి, సరిత తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక యంత్రాలతో రోడ్డు పనులకు శ్రీకారం



**కరీంనగర్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నగర అభివృద్ధి పనులను వేగవంతం చేసి నాణ్యతా ప్రమాణాలు పెంచే దిశగా కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. 35వ డివిజన్‌లో అత్యాధునిక ఏజాక్స్ స్వీయ లోడింగ్ కాంక్రీట్ మిక్సర్ యంత్రంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్ శ్రీకారం చుట్టారు. ఈ యంత్రంతో కాంక్రీట్ మిశ్రమం ఖచ్చితమైన నిష్పత్తిలో సిద్ధమై నిర్మాణ ప్రాంతంలోనే వేగంగా సరఫరా అవుతుందని అధికారులు తెలిపారు. మేయర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడమే లక్ష్యమని, ఆధునిక సాంకేతికతతో కరీంనగర్‌ను మోడల్ నగరంగా తీర్చిదిద్దుతామని అన్నారు. రోడ్డు మందం, కాంక్రీట్ నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పొరేటర్ సాధవిని సుజాత శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## స్వగృహంపై జాతీయ జెండాను ఎగురవేసిన గంగాడి కృష్ణారెడ్డి



**హుజురాబాద్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా జరుగుతున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి హుజురాబాద్‌లోని తన స్వగృహంపై జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. తిరంగా కార్యక్రమాలు దేశ ఐక్యతను బలపరుస్తాయని, యువతలో దేశభక్తి భావాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు గంగిశెట్టి ప్రభాకర్, వార్డు కౌన్సిలర్లు లక్ష్మీదుర్గ, కొండ ప్రశాంతి, మాజీ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, సెంట్రల్ ఫిలిం బోర్డు సభ్యుడు సబ్బని రమేష్, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## లయన్ శివకాంత్‌కు అంతర్జాతీయ ప్రశంసా పత్రం ప్రదానం



**కరీంనగర్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ వేదిర దేశరాజపల్లి వసుధ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జి 11వ జిల్లా క్యాబినెట్ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో లయన్ శివకాంత్ పీఎంజేఎఫ్‌కు సభ్యత్వ వృద్ధిలో చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా అంతర్జాతీయ ప్రశంసా పత్రం ప్రదానం చేశారు. ఈ పత్రాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ 2026--27 అధ్యక్షురాలైన శివకాంత్, మాజీ అంతర్జాతీయ డైరెక్టర్ జి. బాబు రావు పీఎంజేఎఫ్ చేత స్వీకరించారు. జిల్లా గవర్నర్ మోరా బద్రేశం పీఎంజేఎఫ్, మాజీ జిల్లా గవర్నర్లు, సీనియర్ లయన్స్ నాయకులు, క్యాబినెట్ సభ్యులు, విశిష్ట అతిథుల సమక్షంలో ఈ గౌరవం లభించింది. "మేము సేవిస్తాము" అనే నినాదం పట్ల కరీంనగర్ లయన్స్ క్లబ్ నిబద్ధతను ప్రతిబింబించే ఈ గుర్తింపు, సమాజ సేవలో మరింత అంకితభావంతో ముందుకు సాగేందుకు ప్రేరణనిస్తుంది.

## ఘనంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహణ



**కరీంనగర్/ సుల్తానాబాద్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమం కరీంనగర్ జిల్లాలో ఘనంగా ప్రారంభమైంది. పదవ డివిజన్‌లో కార్పొరేటర్ సొగాని కొమరయ్య ఇంటింటా జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కేవలం జెండా ఆవిష్కరణ మాత్రమే కాకుండా దేశభక్తి భావనను ప్రతి కుటుంబానికి చేరవేసే మహత్తర ఉద్యమమని అన్నారు. జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం తన స్వగృహంపై కుటుంబ సభ్యులతో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ జాతీయ పతాకం దేశానికి గర్వకారణమని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జెండాను ఎగురవేసి వికసిత భారత్ నిర్మాణానికి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి భారతీయుడిలో దేశభక్తి, జాతీయతా భావాన్ని బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ జాతీయ జెండాకు గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొని జాతీయ జెండాకు వందనం సమర్పించారు.

## ఆవోప ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక విహారయాత్ర నిర్వహణ



**కరీంనగర్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోప) ఆధ్వర్యంలో ఆదివారం ఆధ్యాత్మిక విహారయాత్ర నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు కొమురవెల్లి వెంకటేశం నేతృత్వంలో వైశ్య భవన్ నుండి బయలుదేరిన సభ్యులు, కుటుంబాలతో కలిసి కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయం, వరంగల్ భద్రకాళి దేవస్థానాన్ని సందర్శించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ శిల్పకళా వైభవాన్ని ఆస్వాదించారు. యాత్రలో వినోదాత్మకంగా తంబోల ఆటల పోటీలు నిర్వహించగా, సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ నారాయణ, రామకృష్ణ, కోశాధికారి కట్కూరి సుధాకర్, ఉపాధ్యక్షులు కొత్త ప్రకాశ్, వి. రవీందర్, శ్రీనివాస్ గాంధీ, ఎల్. చంద్రశేఖర్, శ్రీనివాస్ రావు, ప్రోగ్రామ్ ఇంచార్జ్ నాగమల్ల మునీందర్ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాల పంపిణీ



**హుజురాబాద్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పేదల సొంతింటి కలను నెరవేర్చుతూ హుజురాబాద్ నియోజ కవర్గంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాలను ఘనంగా పంపిణీ చేశారు. కమలాపూర్ మండల కేంద్రంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జెండా గద్దెను ఆవిష్కరించారు. హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ మాట్లాడుతూ గతంలో మంత్రులు, ఎమ్మెల్సీలు, విప్‌గా ఉన్నా పేదలకు ఇళ్ల పంపిణీ జరగలేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం సహకారంతో ఇళ్ల పట్టాలు అందించడం సాధ్యమైందని తెలిపారు. నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేసి వాటి నిర్మాణం దాదాపు పూర్తయిందని, మరో విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు మంత్రులు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి గడపకు సంక్షేమం, ప్రతి ఇంటికి అభివృద్ధి అందిస్తుందని, కులం మతం చూడకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి పథకాలు అందిస్తున్నామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా మాజీ ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, వొడితల ప్రణవ్, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న అమరగాని ప్రదీప్ కుమార్



**జులాపల్లి, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జులాపల్లి మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఘనంగా జరిగింది. జాతీయ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అమరగాని ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ మహనీయుల త్యాగాల స్ఫూర్తితో ప్రతి పౌరుడు జాతీయ భావాలను పుణికి పుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యతను చాటిచెప్పేందుకు ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగరేయాలని, వారం రోజుల పాటు ర్యాలీలు, ఉత్సవాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్, సీనియర్ నాయకులు ఠాకూర్ ప్రదీప్ సింగ్, మాజీ ప్రజాప్రతినిధులు ఎర్రోళ్ల రాములు, కంకణాల జ్యోతిబస్, తీగల అశోక్ గౌడ్, పెద్దల్ల ఐలయ్య, దొడ్ల రాజయ్య, మల్లెత్తుల అంజి యాదవ్, గడ్డం మల్లా రెడ్డి, కంచి శ్రీనివాస్, గుంటి అశోక్, కూసుకుంట్ల వెంకట్ రెడ్డి, మేరుగు కనకయ్య, అలుబోజు రాజేందర్, మల్లెత్తుల సతీష్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆషాఢ మాస గోరింటాకు మహోత్సవం



**రామగుండం, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గోదావరిఖని దుర్గా నగర్ కాలనీలో మహిళల ఆధ్వర్యంలో ఆషాఢ మాస గోరింటాకు మహోత్సవం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మక్కాన్ సింగ్ సేవా సమితి అధ్యక్షురాలు మనాలి రాజ్ ఠాకూర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మహిళలకు స్వయంగా గోరింటాకు పెట్టి అభినందించారు. ఆమె మాట్లాడుతూ గోరింటాకు వేడుకలు మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని, మహిళలు ఐకమత్యంతో ఇలాంటి వేడుకలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. దుర్గా నగర్ నివాసులుగా స్థానికులతో కలిసి ఉండటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, మహిళలు, స్థానిక నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జైల్ భరో కార్యక్రమం నిర్వహణ



**నందికొట్కూరు, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం జైల్ భరో కార్యక్రమం జరిగింది. సిఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి పటేల్ సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర, కార్మికులకు కనీస వేతనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబి స్తున్నాయని విమర్శించారు. రైతులకు రుణమాఫీ, కరువు నియోజకవర్గంగా నందికొ ట్కూరును ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో 200 రోజులు పని కల్పించి రోజువారీ వేతనం 700 ఇవ్వాలని కోరారు. విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లు వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ చేయరాదని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తరువాత ఎస్సై చంద్రశేఖర్ నేతృత్వంలో పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో సిఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగాలో భాగంగా జెండా ఆవిష్కరణ



**కరీంనగర్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ సునీల్ రావు తన నివాసంపై జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలందరిలో జాతీయ భావం, దేశభక్తి పెంపొందించే అద్భుతమైన కార్యక్రమం ఇదని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై మువ్వన్నెల జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఈ నెల 10 నుండి 14 వరకు కొనసాగుతుందని తెలిపారు.

## ఘనంగా గీత కార్మికుల చైతన్య బస్సు యాత్ర కరపత్రాల ఆవిష్కరణ



**హుస్నాబాద్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హుస్నాబాద్ మండలం మడద, మహమ్మదాపూర్ గ్రామాల్లో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో గీత కార్మికుల చైతన్య బస్సు యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యుడు పచ్చిమట్ల రవీందర్, జిల్లా అధ్యక్షుడు కోహెడ కొమరయ్య మాట్లాడుతూ తాటి చెట్లపై నుండి పడి మరణించిన, గాయపడిన గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. గీత కార్మికులకు హామీ ఇచ్చిన పెన్షన్‌ను రూ. 2000 నుండి రూ. 4000కి పెంచాలని, కొత్త పెన్షన్లను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మడద, మహమ్మదాపూర్ గీత కార్మికులకు కమిటీ హాల్ నిర్మాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్ రూ. 40 లక్షలు మంజూరు చేయాలని కోరారు. నీరా ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు రావాలని, బెల్ట్ షాపులను మూసివేయాలని, గౌడులకు వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్లలో 50% రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15న సర్వాయిపేటలో, ఆగస్టు 18న హైదరాబాద్‌లో జరగనున్న సభల్లో గీత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని తమ హక్కుల కోసం ఒత్తిడి తెచ్చాలని పిలుపునిచ్చారు. హామీలు నెరవేర్చకపోతే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మడద, మహమ్మదాపూర్ గీత కార్మికులు పాల్గొన్నారు.

## మండల ఆర్ఎంపి, పిఎంపి నూతన కార్యవర్గం ఏర్పాటు



**కరీంనగర్ రూరల్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కొత్తపల్లి మండల ఆర్ఎంపి, పిఎంపి నూతన కార్యవర్గాన్ని మల్కాపూర్‌లోని కార్యాలయంలో సభ్యుల ఏకాభిప్రాయంతో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంపతి స్వామి, ప్రధాన కార్యదర్శిగా కంచర్ల వెంకట రమణాచారి, ఖజాంచీగా పర్లపల్లి రాజమౌళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా సభ్యులను వచ్చేనెలలో ఎన్నుకొని ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించనున్నట్లు యూనియన్ ఫౌండర్ కొమ్ము గణేష్ తెలిపారు. కార్యక్రమంలో సింహాచలం మారుతీ, కాంరెడ్డి శ్రీనివాస రెడ్డి, ఎనగందుల సురేష్, వడ్లకొండ నరేష్ గౌడ్, మంగు రామచంద్రు, అలాగే కొత్తపల్లి మండల ఆర్ఎంపి, పిఎంపి సభ్యులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయానికి శంకుస్థాపన చేసిన మంత్రులు



**హుస్నాబాద్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఎల్కతుర్తి మండల కేంద్రంలో రూ. 3.25 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న తహసీల్దార్ కార్యాలయ భవనానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మండలాలు ఏర్పాటు చేసినప్పటికీ కార్యాలయ భవనాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల నిర్మాణానికి రూ. 600 కోట్లు కేటాయించిందని, 180 తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలను నిర్మించనున్నట్లు తెలిపారు. భూభారతి చట్టం ద్వారా రైతులకు భూములపై సంపూర్ణ హక్కులు కల్పిస్తున్నామని, సమగ్ర భూ సర్వే కార్యక్రమం ప్రారంభించామని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఎల్కతుర్తి ప్రజలు ఎదురుచూస్తున్న తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి నిధులు సమకూర్చడం సంతోషకరమని, మండల అభివృద్ధికి మరిన్ని చర్యలు చేపడతామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ ఆర్టీఓ కార్యాలయానికి అదనపు నిధులు కేటాయించాలని కోరగా, మంత్రి శ్రీనివాస్‌రెడ్డి ఈ వారంలోనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, అదనపు కలెక్టర్ రవి, ఎన్పి డిసిఎల్ ఎస్.ఈ. సామ్య నాయక్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ రైతు పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శిగా గుజ్జుల రవీందర్ రెడ్డి నియామకం



**కరీంనగర్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జాతీయ రైతు పరిరక్షణ సమితి తెలంగాణ ప్రధాన కార్యదర్శిగా గుజ్జుల రవీందర్ రెడ్డి నియమితులయ్యారు. సింగిల్ విండో చైర్మన్‌గా, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా, ఉత్తమ రైతుగా, వ్యవసాయ కుటుంబం ఆదర్శంగా అనుభవం ఉన్న ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ, రైతు సమస్యలు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

## ఘనంగా క్విట్ ఇండియా దినోత్సవం వేడుకలు




**కరీంనగర్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సర్వోదయ సేవ సమితి ఆధ్వర్యంలో స్థానిక వైశ్య భవన్‌లో క్విట్ ఇండియా దినోత్సవ కార్యక్రమం జరిగింది.సమితి అధ్యక్షుడు పెద్ది లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎనుగంటి మధుసూదన్ రావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 1942లో మహాత్మ గాంధీ “డూ ఆర్ డై” నినాదంతో ప్రారంభించిన క్విట్ ఇండియా ఉద్యమం బ్రిటిష్ ప్రభుత్వాన్ని స్వాతంత్ర్యం ప్రకటించేలా చేసింది అని వివరించారు.ఈ సందర్భంగా తోట లక్ష్మణ రావు, గంజి స్వరాజ్య బాబు, కన్న కృష్ణ, చిదుర సురేష్, సామ నారాయణ, కొమురవెల్లి వెంకటేశం, కట్కూరి సుధాకర్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో రేగూరి రవీందర్, యంసాని జగదీశ్వర్, సత్యనారాయణ, ప్రభాకర్ రావు, సీనియర్ న్యాయవాదులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లోనే ప్రీ ప్రైమరీ విద్య నిర్వహించాలి ఎమ్మెల్యే విజయ రమణారావు



**సుల్తానాబాద్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రీ ప్రైమరీ విద్యను అంగన్వాడీ కేంద్రాల్లోనే కొనసాగించాలని కోరుతూ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావుకు వినతిపత్రం అందజేశారు.శివపల్లిలో ఎమ్మెల్యేను కలిసిన టీచర్లు, హెల్పర్లు మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ విద్యను పాఠశాలలకు అనుబంధం చేస్తే మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు ఐసీడీఎస్ సేవలు దూరమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత నాలుగు దశాబ్దాలుగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు ప్రీ స్కూల్ విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నామని గుర్తుచేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో నమోదైన పిల్లలను పాఠశాలలకు పంపాలని కొంతమంది ఉపాధ్యాయులు ఒత్తిడి చేస్తున్నారని, ఐదు సంవత్సరాలు పైబడిన పిల్లలను మాత్రమే ప్రీ ప్రైమరీలో చేర్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. జిల్లాకు రెగ్యులర్ డీడబ్ల్యూను నియమించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలను కూడా ప్రీ ప్రైమరీలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అంగన్వాడీ కేంద్రాలకు ఎదురవుతున్న సమస్యలను కలెక్టర్, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయ రమణారావు హామీ ఇచ్చారు.కార్యక్రమంలో హేమలత, సుజాత, భార్గవి, రాజేశ్వరి, రాజమణి స్వరూప, శోభ, దేవేంద్ర తదితర అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## సీపీఐ ప్రజా చైతన్య యాత్ర ప్రారంభం



**సుల్తానాబాద్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కేంద్రంలోని ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పిలుపునిచ్చారు. సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రను ఆయన సోమవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలో ప్రారంభించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్‌తో కలిసి ప్రచార యాత్రను ప్రారంభించారు.ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం విద్యార్థులు, యువజనులు, మహిళలు, కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా విధానాలు అమలు చేస్తోందని, పెరుగుతున్న ధరలతో ప్రజల జీవనం భారమైందని, దేశ సంపదను పారిశ్రామికవేత్తలకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు.‘బీజేపీ హటావో.. దేశ్ కీ బచావో’ నినాదంతో సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభ విజయవంతం చేయడానికి దేశవ్యాప్తంగా ప్రజా చైతన్య యాత్రలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు గౌతమ్ గోవర్ధన్, గోశిక మోహన్, కనకరాజు, మార్కాపురి సూర్య, కోడం స్వామి, ప్రజానాట్యమండలి నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉంది కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు.జిల్లాలో ఇప్పటివరకు 2.86 లక్షల ఎకరాల్లో సాగు ప్రారంభమైందని, అందులో 2.21 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేసినట్లు పేర్కొన్నారు. నీటి కొరత కారణంగా ఇకపై వరి సాగు చేయకుండా పప్పు దినుసులు, నూనె గింజలు, తృణ ధాన్యాలు, మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్, ధరలు ఉన్నాయని, గత ఏడాది మొక్కజొన్నను ప్రభుత్వం విజయవంతంగా కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. గ్రామసభలు, రైతు వేదికల్లో ప్రత్యామ్నాయ పంటల అవసరాన్ని వివరించి, రైతులకు తగిన సలహాలు ఇవ్వాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భూగర్భ జలాలు, చెరువులు, కుంటల్లో నీటి కొరత ఉన్నందున వరి సాగు ఇబ్బందులు కలిగిస్తుందని, రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణపై సమావేశం



**కరీంనగర్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చిత్రా మిశ్రా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. చొప్పదండి, కరీంనగర్, మానకొండూర్, హుజురాబాద్ నియోజకవ ర్గాల్లోని కొన్ని పోలింగ్ స్టేషన్ల లొకేషన్ల మార్పులు, గదుల మార్పు, రెండు పోలింగ్ స్టేషన్లను ఒకే కేంద్రంలో కలపడం వంటి అంశాలను చర్చించారు. ఓటర్ల సౌలభ్యం దృష్ట్యా పునర్వ్యవస్థీకరణ సాధారణ ప్రక్రియ అని కలెక్టర్ తెలిపారు.ప్రతి పోలింగ్ స్టేషన్లో 1200 కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే వారిని మరో కేంద్రంలో చేర్చుతామని, సౌకర్యాలు లేని లేదా శిథిలావస్థలో ఉన్న కేంద్రాలను మార్చుతామని చెప్పారు. ప్రతిపాదనలను రాజకీయ పార్టీలు పరిశీలించిన అనంతరం నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో జల కుమారి, బిజెపి, కాంగ్రెస్, ఎంఐఎం, టిఆర్ఎస్ ప్రతినిధులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం జన్మదినం సందర్భంగా అన్నదానం



**షాద్‌నగర్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం జన్మదినాన్ని పురస్కరించుకొని షాద్‌నగర్ మున్సిపాలిటీ బస్ స్టాండ్ ఆవరణలో ఆయన అభిమానులు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్, గిరిజన ఆదివాసి రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం, కౌన్సిలర్ కొప్పునూరి ప్రవీణ్, బచ్చలి నరేష్, మురళీమోహన్ (అప్పి), కట్ట వెంకటేష్ గౌడ్, రఘుమా రెడ్డి, మహబూబ్, లైక్ తదితరులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బోజ్జం ముత్యాల యాదవ్, కూచూరి ప్రవీణ్ కుమార్, గణేష్, ప్రవీణ్ గౌడ్, అగ్గనూర్ నందు, అగ్గనూర్ రవితేజ, వెంకట్ సాయి, రవితేజ, అనూప్ మరోటియా, వినోద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దామరచర్లలో సిపిఐ ప్రచార యాత్ర ప్రారంభం



**దామరచర్ల, ఆగస్టు 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, సిపిఐ ప్రచార యాత్రను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ పిలుపునిచ్చారు.ఆదివారం దామరచర్ల మండల కేంద్రం నుండి ఆయన ఆధ్వర్యంలో సిపిఐ కార్యకర్తలు, యువజన సంఘం నాయకులు, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు కలిసి ప్రచార యాత్రను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి ధనావత్ శాంత, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ధీరవత్ లింగ నాయక్, సిపిఐ సీనియర్ నాయకులు గజ్జల లక్ష్మీ నరసింహ రెడ్డి, జమ్ముల కోటయ్య, భాగం శేషయ్య, సుద్దబోయిన రాములు, నరేష్, పేరుపొంగు లక్ష్మయ్య, దర్శనం రాజా, యువజన సంఘం, విద్యార్థి సంఘం నాయకులు, జిల్లా నాయకుడు యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## తంతు మారుస్తున్న సంతు



మాతృదేవోభవ
మాట మారుతుంది
పితృదేవోభవ
తీరు మారుతుంది
నవమాసాలు మోసి
కని పెంచి
ముద్దు మురిపాలతో
తన పాలను ప్రసాదించి
లాలించి.. పాలించి..
బుజ్జగించి, బువ్వ తినిపించి
అనురాగం కురిపించి
ఆత్మీయత చూపించిన
తల్లి మనసు
తల్లడిల్లుతుంది
తప్పటడుగులు వేసినపుడు
సంతసించి
తప్పుటడుగులను
సవరించి
నడక నేర్పించి
నడత చూపించి
పెంచి,పోషించి
తన భుజాల పైనుండే
విశ్వవిక్షణం గావించి
నా పిల్లలే ప్రధానమని
సర్వం దానం చేసిన
తండ్రి హృదయం
లయ తప్పుతుంది
మా పిల్లలు పెరగాలి
చాలా పైకి ఎదగాలని
జననీ జనకులు
తలిస్తే...తపిస్తే...
పిలిస్తే పలకనంత దూరానికి
అగుపించని అంతరంగాలతో
అంతరాలకు....
ఖండంతరాలకు....
ఎగిరిపోయారు
కనీస బాధ్యతలను
ఎగవేసి పోయారు
సూర్యచంద్రులను
నక్షత్రాలను
చూపించిన
మాతాపితలకు
చుక్కలు చూపిస్తున్నారు
ఆఖరి క్షణాల్లో సైతం
ఆదిని ఆదమరిచి
పునాదిని విస్మరించి
సంతానదేవోభవ అని
దీనంగా స్మరించే
అమ్మానాన్నలను
కడుహీనంగా
ఆన్లైన్ ప్యాకేజీలతో
అంత్యక్రియలు జరిపించి
మానవత్వాన్ని
మట్టిలో కలిపి
కుటుంబ విలువల్ని
వల్లకాడులో కాల్చి
చేతులు దులుపుకునే
మొద్దు దద్దమ్మలవుతున్నారు

శ్రీనివాస్
ఉపాధ్యాయుడు
కనుకుల
స్వగ్రామం: ఎలిగేడు

( ఈ మధ్యకాలంలో కనీసం తల్లిదండ్రుల అంత్యక్రియలకు కూడా హాజరుకాని కొందరు కఠిన హృదయం గల సంతానానికి వ్యతిరేకంగా రాసిన కవిత )

## అర్ధరాత్రి విగ్రహ గద్దె కూల్చివేతపై మన్నె గోవర్ధన్‌రెడ్డి ఆగ్రహం




**- ఉద్యమ చరిత్రను చెరిపేయలేరు..**
**- అధికారులను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ అరాచకం: ఎంజీఆర్**

**ఖైరతాబాద్, ఆగస్టు10(నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ ఉద్యమ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం కోసం ఏర్పాటు చేసిన గద్దెను అర్ధరాత్రి కూల్చివేయ డంపై ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ మన్నె గోవర్ధన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమ నాయకుల చరిత్రను చెరిపేయాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. గద్దెలను కూల్చవచ్చేమో కానీ.. ప్రజల గుండెల్లో ఉన్న పెద్ది సుదర్శన్‌రెడ్డి పోరాట స్ఫూర్తిని చెరిపేయడం ఎవరి తరమూ కాదన్నారు.అధికారులను అడ్డుపెట్టుకుని అర్ధ రాత్రి కూల్చివేతలకు పాల్పడటం ప్రజా స్వామ్య విలువలను అవమానించడమేనని మండిపడ్డారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని రాజకీయ అవసరాలకు వినియోగించడం మానుకోవాలని హితవు పలికారు. అధికారం శాశ్వతం కాదని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలి. ఉద్యమకారులపై కక్ష సాధింపు చర్యలు ఆపి, కూల్చివేతపై ప్రభుత్వం వెంటనే ప్రజలకు వివరణ ఇవ్వాలి అని ఎంజిఆర్ డిమాండ్ చేశారు.

## నేడు లైన్ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేత

**కరీంనగర్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** 11 కెవి లైన్ పనుల కారణంగా బ్యాంక్ కాలనీ సబ్‌స్టేషన్ నుండి వచ్చే ఫీడర్‌కు ఈరోజు మధ్యాహ్నం 12 గంటల నుండి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు.తేజ స్కూల్, విద్యాధారి స్కూల్, రెడ్డి ఫంక్షనల్ హాల్, బూత్ బంగ్లా, గుండు హనుమంతుని గుడి ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని ఏడీఈ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

## రేకోని వాగు సమీపంలో అక్రమ ఇసుక దందా



**ఖానాపూర్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఖానాపూర్ మండలంలోని రేకోని వాగులో జెసిబీలతో ఇసుక తవ్వి అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం.ఇసుక మాఫియాపై అధికారులు సరైన నిఘా పెట్టకపోవడం వల్లే ఈ అక్రమ రవాణా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా పకడ్బందీ చర్యలు తీసుకుని ఇసుక దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## గుండ్లపల్లి పొత్తూరు డబుల్ రోడ్డు నిర్మాణంపై బీజేపీ నిరసన



**గన్నేరువరం, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గుండ్లపల్లి రాజీవ్ రహదారి నుంచి గన్నేరువరం మీదుగా పొత్తూరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపడతామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు మండలంలో నిరసన తెలిపారు.మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి హైవే వద్ద ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రహదారి అధ్వానంగా మారిందని, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వెంటనే డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలా లేక రాజీనామా చేయాలా నిర్ణయించుకోవాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో మండల ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ముత్యాల జగన్ రెడ్డి, ఏలేటి చంద్రారెడ్డి, సొల్లు అజయ్ వర్మ, విలాసాగరం రామచంద్రం, మచ్చసాయి, పుల్లెల జగన్, బమండ్ల రాజు, గాలిపెల్లి శంకర్, గూడెల్లి మల్లేశం, అటికం రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ అక్రమాలపై వైఎస్సార్‌సీపీ భారీ ర్యాలీ నిర్వహణ




**నందికొట్కూరు, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** డీఎస్సీ అక్రమాలపై నిరసనగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నందికొట్కూరులో భారీ ర్యాలీ జరిగింది. నియోజకవర్గ పరిశీలకుడు బుడ్డా శేషిరెడ్డి, సమన్వయకర్త దారా సుధీర్ ఆధ్వర్యంలో వైసిపి కార్యాలయం నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. పోలీసులు అనుమతి నిరాకరించినప్పటికీ, నోటీసులను ధిక్కరించి ర్యాలీ కొనసాగించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డీఎస్సీలో జరిగిన అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. స్పోర్ట్స్ కోటాలో నిరుద్యోగులను మోసం చేసి ఫేక్ సర్టిఫికెట్లు ఉన్న వారికి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత ర్యాలీలను అడ్డుకోవడం కూటమి ప్రభుత్వ కుట్ర అని విమర్శిస్తూ, ఎన్ని అడ్డంకులు వచ్చినా నిరుద్యోగుల పక్షాన పోరాటం కొనసా గిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేసీ కాలువకు సాగునీరు విడుదల చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నిరసన




**నందికొట్కూరు, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కేసీ కాలువకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు, ప్రజలు సోమవారం ఏఈఈ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.సామాజిక సేవకుడు గుజ్జుల గౌరీశ్వర నాయుడు మాట్లాడుతూ సాగునీరు అందకపోతే రైతులు తీవ్ర నష్టపోతారని, తుంగభద్ర డ్యాం నుంచి నీరు విడుదలైన నేపథ్యంలో కేసీ కాలువకు కూడా నీరు ఇవ్వాలని కోరారు.జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హంద్రీ--నీవా సుజల స్రవంతి, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాలను సమర్థవంతంగా వినియోగించి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సకాలంలో నీరు అందకపోతే పంటలు దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టపోతారని, తాగునీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, మహిళా నాయకురాళు ్లు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై.. అనారోగ్యంతో యువకుడి బలవన్మరణం



**కరీంనగర్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కడుపునొప్పి బాధను భరించలేక మద్యానికి బానిసైన యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన కరీంనగర్ రూరల్ మండలంలో చోటుచేసుకుంది. చంద్రాపూర్ కాలనీకి చెందిన గొర్రె మధు (35) ఉదయం కూలి పనికి వెళ్లి, ఆరోగ్యం బాగోలేదని ఇంటికి తిరిగి వచ్చాడు. మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకొని మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు.మధు గత కొంతకా లంగా మద్యానికి బానిసై, కడుపునొప్పితో బాధపడుతూ చికిత్స పొందుతున్నప్పటికీ నొప్పి తగ్గలేదని అతని అన్న మనోహర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.పోలీసులు కేసు నమోదు చేసి, శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## వర్షాల కోసం కప్పలకు పెళ్లి



మర్రిగూడ, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ సరంపేట గ్రామంలో సోమవారం గ్రామస్తులు, రైతులు కప్పలకు పెళ్లి నిర్వహించారు.గ్రామ సర్పంచ్ నక్క రాములమ్మ రవి ఆధ్వర్యంలో వరుణదేవుని కరుణించమని ప్రత్యేక పూజలు చేశారు. డప్పు వాయిద్యాల నడుమ గ్రామంలోని బొడ్రాయి దేవతలకు అలంకరించి జలాభిషేకం చేసి, నైవేద్యం సమర్పించారు.ఈ విశిష్టమైన సంప్రదాయ కార్యక్రమంలో వార్డు సభ్యులు నక్క యాదయ్య, నక్క వెంకటేష్, గ్రామస్తులు, రైతులు, యువకులు, మహిళలు పాల్గొని వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రార్థించారు.

## మృతురాలి కుటుంబానికి పరామర్శ



ఎలిగేడు, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):ఎలిగేడు మండలంలోని ధూళికట్ట గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ కార్యకర్తలు వీరగోని లక్ష్మీనారాయణ గౌడ్, వీరగోని పరుశరాములు గౌడ్ల తల్లి శాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.ఈ సందర్భంగా సోమవారం మృతురాలి కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర కోర్కమిటీ సభ్యుడు గొట్టెముక్కుల సురేష్ రెడ్డి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొక్కిరాల దామోదర్ రావు, బత్తిని శ్రీనివాస్ గౌడ్, కందుల శ్రీనివాస్, రంగు శ్యాం గౌడ్, భూసారపు తిలక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలిగేడులో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం



ఎలిగేడు, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):బీజేపీ పార్టీ పిలుపు మేరకు సోమవారం ఎలిగేడు మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో అంబేద్కర్ విగ్రహం ఎదుట హర్ ఘర్ తిరంగా కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి నినాదాలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల కన్వీనర్ కొత్తిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, నాయకులు చౌదరి తిరుపతి యాదవ్, పరుశరాములు గౌడ్, రాకేశ్ యాదవ్, సుమన్, రవి, భాస్కర్ రెడ్డి, అడ్డగుంట తిరుపతి గౌడ్, బోగె కిరణ్, గంగయ్య, శంకర్, రాజ్ కుమార్ ప్రతాప్, కోడూరి శ్రీనివాస్, సతీష్ రెడ్డితో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కిషన్‌రెడ్డికి ఎమ్మెల్యే కసిరెడ్డి ఘన సత్కారం



ఆమనగల్లు, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మాడుగుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టు కిషన్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం మాడుగుల మండలంలోని వాసవి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కిషన్‌రెడ్డిని పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఆమనగల్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. కిషన్‌రెడ్డి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కిషన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన చురుకైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో మాడుగుల మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొండల్‌రెడ్డి, నాజర్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, శ్రీనునాయక్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పాపిశెట్టి రాము ఆపన్నహస్తం



ఆమనగల్లు, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆమనగల్లు మండలం సింగంపల్లి గ్రామానికి చెందిన వరికుప్పల వెంకటేష్, తలకొండపల్లి మండలం అర్లకుంట తాండకు చెందిన బాణావత్ హనుమా నాయక్, కల్వకుర్తి మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన మద్దెల పుల్లయ్యలు మృతి చెందిన విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము వారి కుటుంబాలను విడివిడిగా పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబాల ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని తనవంతుగా ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబాలు అధైర్యపడవద్దని, కష్టకాలంలో వారికి అండగా ఉంటానని పాపిశెట్టి రాము భరోసా కల్పించారు. మానవత్వంతో బాధిత కుటుంబాలకు సహాయం చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. పాపిశెట్టి రాము అందించిన ఆపన్నహస్తానికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట నూతనగంటి భాస్కర్, బొబ్బిలి, నరసింహ, గణేష్, రాజు, రాఘవేందర్, కృష్ణ, రాజు, చిన్న, లక్ష్మణ్, రవి నాయక్, శరత్, నవీన్, శివ, లక్ష్మయ్య, చెన్నకేశవులు, శ్రీనివాస్, శ్రీను, ఆనంద్ తదితరులు ఉన్నారు.

## అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్లు పట్టివేత



కల్వకుర్తి, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కల్వకుర్తి మండల పరిధిలోని గుండూరు గ్రామ శివారులో సోమవారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జైల్ భరో

నల్లగొండ, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):నాడు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేడు కార్పొరేట్ పెట్టుబడిదారులు, మతోన్మాద శక్తుల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున పిలుపునిచ్చారు.ఆయన మాట్లాడుతూ, "కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ బిల్లు--2025, విత్తన చట్ట సవరణలు పెట్టుబడిదారులకు అనుకూలంగా తీసుకొస్తోంది. కార్మికులు సాధించిన 8 గంటల పని హక్కు, సమ్మె హక్కు, ఉద్యోగ భద్రత వంటి హక్కులను లేబర్ కోడ్స్ ద్వారా కాలరాస్తోంది" అని విమర్శించారు.అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేసి, పీఎఫ్, ఈఎస్ఐ, వెల్ఫేర్ బోర్డులపై కోతలు విధిస్తున్నారని, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, ఐకేపీ, వీఏఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కోట్లాది మంది కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత



కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో ప్రజలు ఉపాధి హామీ పనులపై ఆధారపడుతున్నారని, కానీ కేంద్రం తీసుకొస్తున్న కఠిన నిర్ణయాల వల్ల పథకం నీరుగారి పోతోందని పేర్కొన్నారు. "ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించి, సంవత్సరానికి కనీసం 200 రోజుల పని కల్పించాలి. రైతులకు గిట్టుబాటు ధర, వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి" అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్పుల యాదయ్య, మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దామెర లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నీలకంఠం రాములు, రైతు సంఘం కార్యదర్శి ఏరుకొండ రాఘవేంద్ర, మైల సత్తయ్య, అమాలి వర్కర్స్ నాయకులు పళ్ళ నరసింహ, ఒట్టికోటి పండు, చేతివృత్తిదారుల సంఘం జిల్లా నాయకుడు సలువోజు రామలింగాచారి, అంగన్వాడీ నాయకులు లక్ష్మి, మట్టం భాగ్యమ్మ, జంపాల వసంత, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు చిలువేరు లింగయ్య, గ్రామపంచాయతీ వర్కర్స్ నాయకుడు రామావత్ రాజు నాయక్, ఎలక్ట్రీషన్ యూనియన్ నాయకుడు కర్నాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తిప్పర్తిలో క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ర్యాలీ, రాస్తారోకో



తిప్పర్తి, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల, కార్మిక--రైతు ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు సోమవారం తిప్పర్తి మండల కేంద్రంలో సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ, రాస్తారోకో కార్యక్రమం జరిగింది.మార్కెట్ నుండి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం అద్దంకి హైవేపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నన్నూరి వెంకటరమణ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గండమళ్ళ రాములు, సిఐటియు మండల కన్వీనర్ భీమగాని గణేష్ మాట్లాడుతూ, "నాడు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేడు కార్మికులు, రైతులు, ప్రజలు జైల్ భరోలో పాల్గొని మోడీ ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలి" అని పిలుపునిచ్చారు.వారు విమర్శిస్తూ, "గత 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక--రైతు హక్కులను కాలరాస్తోంది. లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ చట్టం, విత్తన చట్టం ద్వారా కార్మిక--వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగిస్తోంది. ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి కొత్త పథకాలతో కోట్లాది కార్మికుల జీవితాలను నాశనం చేస్తోంది" అని అన్నారు.స్కీమ్ వర్కర్లను శాశ్వతం చేయాలని, ఆశా వర్కర్ల కనీస వేతనం రూ.26,000గా నిర్ణయించాలని, గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం కల్పించాలని, స్కావెంజర్లకు ఉద్యోగ భద్రత, ప్రతి కార్మికునికి పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు మన్నెం బిక్షం, సిఐటియు మండల కన్వీనర్ భీమగాని గణేష్, మంత్రాల మంగమ్మ, రైతు సంఘం కార్యదర్శి కంది దామోదర్ రెడ్డి, నాయకులు చెనగోని వెంకన్న, పోకల శశిధర్, మైనం శివప్రసాద్, పోకుల ఝాన్సీ, భీమగాని విజయలక్ష్మి, శ్రీనివాస్ రెడ్డి, కొల్లు వెంకన్న, టి. పార్వతమ్మ, రూమణ అనిత, డి. నిర్మల, యల్లమ్మ, పులమ్మ, కంచర్ల జానయ్య, పాలడుగు చంద్రయ్య, పర్శరాములు, పోలగోని యాదమ్మ, సైదమ్మ, రూతమ్మ, నల్ల శ్రీనివాస్, ఎలుక కోటిరెడ్డి, లింగయ్య, పి. సైదులు, యాదగిరి, పుష్ప, రుద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పి ఆర్ సి ని ప్రకటించి వెంటనే అమలు చేయాలి

**- ఆరు పెండింగ్ డీఏలను విడుదల చేయాలి**
**సీపీఎస్ ను రద్దు చేయాలి**
**- టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి**

హనుమకొండ, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం జరిగింది. జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రగిరి లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి రావుల రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ, "పీఆర్సీ గడువు ముగిసి మూడు సంవత్సరాలు దాటినా ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. తక్షణమే పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలి. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలి. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్




రూల్స్ రూపొందించి పర్యవేక్షణ పోస్టులను భర్తీ చేయాలి. టీచర్ల ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలి" అని డిమాండ్ చేశారు.అలాగే, "నూతన ఆరోగ్య పథకం కోసం ఉపాధ్యాయుల వేతనం నుండి ఒకటిన్నర శాతం జమ చేస్తున్నప్పటికీ ఆరోగ్య కార్డులు ఇవ్వకపోవడం అన్యాయం. వెంటనే మార్గదర్శకాలను విడుదల చేసి వైద్యాన్ని అందించాలి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలి" అని స్పష్టం చేశారు.ప్రభుత్వ బడుల మూసివేత ఆలోచనలను విరమించుకోవాలని, సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి వేతన స్కేళ్లు వర్తింపజేయాలని ఆయన కోరారు.ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 12,13న మండల కేంద్రాల్లో మెమోరాండంలు, 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, 29న ఇందిరా పార్క్‌లో మహా ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. స్పందన లేకుంటే సెప్టెంబరులో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా "చలో అసెంబ్లీ" కార్యక్రమం చేపడతామని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిశాల సత్యనారాయణ, సీనియర్ నాయకులు బిల్లా సుబ్బారావు, రాష్ట్ర కౌన్సిలర్ ముత్యాల రఘుపతి, భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జగపతి రావు, జిల్లా ఉపాధ్యక్షులు ఇప్పకాయల కుమారస్వామి, జిల్లా కార్యదర్శి అంకం శ్రీనివాస్, కమిటీ సభ్యులు వీరభద్రం, చక్రు నాయక్, కుమారస్వామి, సదానందం, కొమురయ్య, చందర్ నాయక్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# తెల్కపల్లిలో సిపిఐ పాదయాత్ర, బహిరంగ సభ

తెల్కపల్లి, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ సమితి పిలుపు మేరకు ఆగస్టు 6 నుండి 14 వరకు జరుగుతున్న ప్రచార యాత్రలో భాగంగా సోమవారం తెల్కపల్లి మండల పరిధిలో పాదయాత్ర కొనసాగింది. చిన్న ముద్దనూరు, రామ్‌రెడ్డి పల్లి, కారువంగా, తాళ్లపల్లి, నడిగడ్డ, రామగిరి, గౌరారం, పర్వతాపురం, రాకొండ గ్రామాల్లో ప్రచారం చేసిన అనంతరం లింగాల్ రోడ్ పెట్రోల్ బంక్ నుండి నెహ్రూ చివరస్తా వరకు భారీ పాదయాత్ర నిర్వహించి బహిరంగ సభ జరిగింది.సభకు అధ్యక్షత వహించిన జిల్లా కౌన్సిల్ సభ్యుడు సూర్య శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. బాల నరసింహ, రాష్ట్ర సమితి సభ్యులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె. కేశవులు గౌడ్ పాల్గొన్నారు.బాల నరసింహ మాట్లాడుతూ, "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి. బీజేపీ ప్రభుత్వం 2014లో ఇచ్చిన ఉద్యోగ




హామీలు, మహిళలకు 33% రిజర్వేషన్, పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలు అన్నీ విఫలమయ్యాయి. కార్మికుల హక్కులను నాలుగు లేబర్ కోడ్స్ ద్వారా కాలరాసి, పని గంటలను 8 నుండి 12కు పెంచి కార్పొరేట్లకు అనుకూలంగా మారింది. రైతులకు గిట్టుబాటు ధర లేకుండా మూడు వ్యవసాయ చట్టాలను తెచ్చి రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టింది" అని విమర్శించారు.అలాగే, "దళిత, గిరిజన, బీసీ, మైనార్టీ వర్గాలకు న్యాయం చేయకుండా వివక్షత చూపుతున్న మోడీ ప్రభుత్వాన్ని ప్రజలు ప్రతిఘటించాలి. పాదయాత్రల ద్వారా ప్రజలను చైతన్యపరచి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తాం" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బాలమురళీకృష్ణ, మారేడు శివశంకర్, మండల కార్యదర్శి వేనేపల్లి రవీందర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దేశామోని ఆంజనేయులు, సహాయక కార్యదర్శులు బుగ్గ స్వామి, గొడుగు విష్ణు, నరేందర్ రెడ్డి, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు తన్నీరు మల్లయ్య, కళాకారులు నరసింహ, మధు, నిరంజన్, పర్వతాలు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి మాడుగుల నరసింహ, కేశవులు, గ్రామ శాఖ నాయకులు రాములు, పూసల నరసింహ, ఇతరులు పాల్గొన్నారు.

# జైలు భరో సందర్భంగా నిరసన ర్యాలీ

కల్వకుర్తి, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం కల్వకుర్తి మండల కేంద్రంలో సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. శివాజీ చౌక్ నుండి మహబూబ్‌నగర్ చౌరస్తా వరకు నినాదాలతో సాగిన ర్యాలీ అనంతరం అక్కడే రాస్తారోకో నిర్వహించారు. అరగంటపాటు వాహనాలు నిలిచిపోయాయి.సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ, "కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి. విబిజి రాంజీ పథకాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని యథాతంగా అమలు చేయాలి. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి. రైతులకు నష్టం కలిగించే అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసి స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలి" అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు శివరాం, బాలయ్య, భవన నిర్మాణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింత ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు చిలుక బాలరెడ్డి, జిల్లా నాయకులు మల్లారెడ్డి, కృష్ణారెడ్డి, వ్యవసాయ




కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి. బాలస్వామి, సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు శోభావతి, మహేష్, రాజు, స్వప్న, అలివేలు, అలాగే కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పరశురాములు, స్టడీ సర్కిల్ కన్వీనర్ ఏపీ మల్లయ్య, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య జగన్ తదితరులు పాల్గొన్నారు.

RNI - TELTEL/2023/87644
మంగళవారం, ఆగస్టు 11, 2026


## నర్సిరెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే కసిరెడ్డి

**- రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీనియర్ నాయకుడికి పరామర్శ**
**- వైద్యులను అడిగి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే**



**అమనగల్, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమనగల్ మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు దారెడ్డి నర్సిరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి వెల్దండలోని ఎన్ఎన్ఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం ఆసుపత్రికి వెళ్లి నర్సిరెడ్డిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు వైద్యులను కలిసి అందుతున్న చికిత్స వివరాలను తెలుసుకున్నారు. నర్సిరెడ్డి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, సంజీవ, యాచారం వెంకటేశ్వర్లు గౌడ్, సర్పంచ్ పాలకూర్ల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులును వేగవంతం చెయ్యాలి

**- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని కలిసి,కృతజ్ఞతలు తెలిపిన తెలంగాణ బీజేపీ బృందం!**



**వరంగల్ ,ఆగస్టు 10(నీలగిరి ఎక్స్ ప్రెస్):**వరంగల్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులును వేగవంతం చెయ్యాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని తెలంగాణ బీజేపీ బృందం కలిసి కృతజ్ఞతలు తెలిపారు.వరంగల్-మామునూరు విమానాశ్రయ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక ఆమోదం తెలిపినందుకు గాను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తో పాటు మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు ప్రొఫెసర్ ఆజ్మీరా సీతారామ్ నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.
ఈ మేరకు అదిలాబాద్ లోకసభ సభ్యులు గోడెం నగేష్,ప్రొఫెసర్ ఆజ్మీరా సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ మరియు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా వన్నాల వెంకటరమణ లతో కూడిన బీజేపీ నాయకుల బృందం న్యూఢిల్లీలో జోర్బాగ్ సాఫదారగంజ్ లోని కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యాలయంలో మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు ఒక అధికారిక లేఖ అందజేశారు.
తెలంగాణ ఉమ్మడి వరంగల్ జిల్లాల ప్రజల దశాబ్దాల కాలం నాటి చిరకాల వాంఛ మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చూపిన చొరవ, ప్రత్యేక శ్రద్ధ అభినందనీయమని సీతారామ్ నాయక్ పేర్కొన్నారు. తాను మహబూబాబాద్ ఎంపీగా ఉన్న సమయంలో వరంగల్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతాల్లో విమానాశ్రయాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశానని, ఈ రోజు ఆ కల నెరవేరుతుండటం తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని లేఖలో ఆజ్మీరా స్మరించుకున్నారు.బాధ్యతలు స్వీకరించిన కొత్తలో కేంద్ర మంత్రితో జరిగిన భేటీని గుర్తుచేసుకుంటూ..రామ్మోహన్ నాయుడి నిరాడంబరత, అందుబాటులో ఉండే స్వభావం మరియు చురుకైన నాయకత్వం స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు.ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని వరంగల్ పర్యటనకు విచ్చేయాల్సిందిగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ను బీజేపీ బృందం ఆహ్వానించింది. మామునూరు విమానాశ్రయ ప్రాజెక్టు శంకుస్థాపన లేదా అధికారిక ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై,ఈ ప్రాంత ప్రజలను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.
కేంద్ర మంత్రి రాక తెలంగాణ ప్రాంత అభివృద్ధికి,కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలావుండగా అదిలాబాద్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి వెంటనే శ్రీకారం చుట్టాలని అదిలాబాద్ లోకసభ సభ్యులు గోడెం నగేష్ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ను కోరారు.
అలాగే మామునూరు విమానాశ్రయంలో భూములు కోల్పోయిన కుటుంబాలకు మరియు సమీప ప్రాంతం లోని ప్రజలకి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ మరియు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణలి లు మంత్రి ని కోరారు.
వీరి విజ్ఞప్తులను అంగీకరించి కేంద్ర మంత్రి పరిగణలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రివర్యులను బీజేపీ బృందం సత్కరించింది.

## తైక్వాండో గిన్నిస్ రికార్డు సాధించిన



**వెల్దండ, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రానికి చెందిన ఎండి జాంగిర్ తైక్వాండో క్రీడలో ప్రపంచ స్థాయి ప్రతిభను ప్రదర్శించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారు.హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో బ్లాక్ బెల్ట్ ఫస్ట్ డాన్గా పాల్గొన్న జాంగిర్, ఎంజేఆర్ ఇంటర్నేషనల్ తైక్వాండో అకాడమీ--సుమన్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనలో రికార్డు సృష్టించారు.గ్రాండ్ మాస్టర్ జయంత్ రెడ్డి మాట్లాడుతూ, "జాంగిర్ తైక్వాండో రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించి ప్రపంచ స్థాయిలో నిలిచిపోయేలా గిన్నిస్ రికార్డు సాధించాడు" అని అభినందించారు. అలాగే మాస్టర్లు ఎండి ఖలీల్, కుమార్ జాంగిర్‌ను అభినందించారు.

## ఏకలవ్య పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ ఉత్సవాలు




**వెల్దండ, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామంలో ఉన్న ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలో బోనాల పండుగ ఉత్సవాలను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ సుమన్ కుమార్ సమక్షంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.బోనాల పండుగలో భాగంగా గుండాల గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయానికి పాఠశాల తరఫున బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని పండుగ విశిష్టతను చాటారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడంతో పాటు వాటి పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పాఠశాల నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కోడెం భాస్కర్, ఉపాధ్యాయులు అనీషా, ధర్మేందర్, అనూష, మల్లికతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని బోనాల ఉత్సవాలను విజయవంతం చేశారు.

## మాడుగులలో ఆలయ అభివృద్ధికి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి విరాళం



**మాడుగుల, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాడుగుల మండలంలోని దొడ్లపహాడ్ గ్రామంలో వీరనాగమ్మ దేవత ఆలయంలో 41 రోజుల పూజా కార్యక్రమం ముగింపు సందర్భంగా ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పాల్గొన్నారు .అమ్మ వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించిన అనంతరం ఆలయ అభివృద్ధి కోసం రూ.1.80 లక్షల భారీ విరాళాన్ని అందజేశారు. ఆలయాలు ప్రజల విశ్వాసాలు, సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు.ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మట్టనాగయ్య, యాదయ్య, అర్జున్, మల్లేష్, శ్రీను, శంకర్, రాజు, నాగరాజు, వెంకటేష్, సురేష్, సత్తయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## నిద్రలేమి సమస్య ఉన్నవారు పాటించాల్సిన చిట్కాలు ఇవే.. హాయిగా నిద్రించవచ్చు..



ఆరోగ్యంగా ఉండడానికి తగినంత నిద్ర ఎంతో అవసరం. అయితే వృత్తిపరమైన ఒత్తిడి, వ్యక్తిగత సమస్యలు, శారీరక శ్రమ తక్కువగా ఉండే జీవనశైలి, సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం వంటి కారణాలతో చాలామందిలో నిద్ర విధానం దెబ్బతింటోంది. సాధారణంగా రోజుకు 8 గంటల నిద్ర ఆరోగ్యానికి మంచిదిగా వైద్యులు చెబుతుంటారు. కానీ ప్రస్తుత జీవనశైలిలో ప్రతిరోజూ 8 గంటలు నిద్రపోవడం చాలామందికి సాధ్యం కావడం లేదు. తగినంత నిద్ర లేకపోవడం లేదా నిద్ర సమయాల్లో తరచూ మార్పులు రావడం వల్ల స్వల్పకాలికంగానే కాకుండా దీర్ఘకాలంలోనూ ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. చిరాకు, ఏకాగ్రత తగ్గడం, మెదడు పనితీరుపై ప్రభావం, బరువు పెరగడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని సందర్భాల్లో డిప్రెషన్‌కు కూడా దారితీస్తోంది. రాత్రి పడుకునే ముందు ఎక్కువగా తినడం లేదా పడుకునే సమయానికి చాలా దగ్గరగా భోజనం చేయడం వల్ల గుండెల్లో మంట, అజీర్ణం వంటి సమస్యలు వస్తాయి. దీంతో నిద్రపోవడం కష్టంగా మారుతుంది. అందువల్ల రాత్రివేళ పడుకునే ముందు అతిగా తినడం, మధ్యలో అనవసరంగా స్నాక్స్ తీసుకోవడం వంటివి తగ్గించుకోవాలి.(క్రమబద్ధమైన అలవాటు ముఖ్యం..ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, మేల్కొనడం వంటి క్రమబద్ధమైన నిద్ర అలవాటును పాటించడం కూడా ముఖ్యమే. వారాంతాల్లో కూడా నిద్ర సమయాన్ని ఎక్కువగా మార్చకుండా చూసుకోవడం వల్ల శరీరంలోని జీవ గడియారం క్రమబద్ధంగా పనిచేయడానికి సహాయపడుతుంది. శరీరానికి ఒక సహజమైన జీవ గడియారం ఉంటుంది. అది సక్రమంగా పనిచేస్తే రాత్రి నిద్రపోవడం, నిద్రను కొనసాగించడం సులభమవుతుంది. శారీరక శ్రమ లేకుండా ఎక్కువసేపు కూర్చునే జీవనశైలి కూడా నిద్రపై ప్రభావం చూపిస్తుంది. ప్రతిరోజూ కొంత సమయం వ్యాయామం చేయడం వల్ల రాత్రివేళ మెరుగైన నిద్ర పొందేందుకు సహాయపడుతుంది. వ్యాయామం తీవ్రంగా ఉండాల్సిన అవసరం లేదు, తేలికపాటి శారీరక కార్యకలాపాలు కూడా నిద్రకు ఉపయోగపడతాయి. రాత్రివేళ మద్యం, సిగరెట్లు, కెఫీన్ వంటి వాటిని తీసుకోవడం నిద్రకు అంతరాయం కలిగిస్తాయి. అలాగే పడుకునే సమయానికి దగ్గరగా ఎక్కువగా లేదా మసాలాలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం కూడా నిద్రపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. కాబట్టి రాత్రి భోజనాన్ని తేలికగా, పడుకునే సమయానికి కొంత ముందుగానే ముగించడం మంచిది.పాలలో ఇవి కలిపి తాగితే..పడకపై నిద్రపోవడం తప్ప ఇతర పనులు చేయడం కూడా నిద్రకు ఆటంకం కలిగిస్తాయి. పుస్తకం చదవడం, మొబైల్ స్క్రీన్ చూడటం లేదా ఇతర పనులు చేయడం వంటి అలవాట్లు పడకను నిద్ర కోసం ఉపయోగించే ప్రదేశంగా మెదడు గుర్తించకుండా చేస్తుంది. అందువల్ల ఇలాంటి పనులు చేయాల్సి వస్తే మరో గదిలో పూర్తి చేసి, నిద్రపోయే సమయంలో మాత్రమే పడకపైకి వెళ్లడం మంచిది. నిద్ర సమస్యలు లేదా స్వల్ప స్థాయి నిద్రలేమి ఉన్నవారు ఆయుర్వేదంలో సూచించే కొన్ని ఆహార పద్ధతులను కూడా ప్రయత్నించవచ్చు. పడుకునే ముందు గోరువెచ్చని పాలలో చిటికెడు జాజికాయ, కొద్దిగా యాలకులు, మెత్తగా చేసిన బాదం కలిపి తీసుకోవడం మేలు చేస్తుంది. అలాగే పాలు, నీరు, తాజా వెల్లుల్లి కలిపి మరిగించి తయారు చేసిన వెల్లుల్లి పాలను తీసుకోవచ్చు. ఒక కప్పు పాలకు పావు కప్పు నీరు, ఒక వెల్లుల్లి రెబ్బను కలిపి మరిగించి, ద్రవం ఒక కప్పు పరిమాణంలో మిగిలిన తర్వాత తీసుకో వాలి.చెర్రీలు..చెర్రీలను క్రమం తప్పకుండా తీసుకోవడం కూడా మంచి నిద్రకు సహాయపడుతుంది. అలాగే ఒక కప్పు తాజా టమాటా రసంలో రెండు టీస్పూన్ల చక్కెర, చిటికెడు జాజికాయ కలిపి సాయంత్రం 4 నుంచి 5 గంటల సమయంలో తీసుకుని, రాత్రి భోజనాన్ని ముందుగానే ముగించాలి. నిద్రను మెరుగుపరచుకోవడానికి బ్రాహ్మి, అశ్వగంధ, శంఖపుష్పి, జటమాంసి వంటి కొన్ని మూలికలను కూడా ఉపయోగించవచ్చు. అయితే నిద్ర సమస్యలు తరచూ కొనసాగుతున్నప్పుడు లేదా ఎక్కువకాలంగా నిద్రలేమితో బాధపడుతున్నప్పుడు స్వయంగా మూలికలు లేదా ఇతర చికిత్సలు ప్రారంభించకుండా
నిపుణులను సంప్రదించడం మంచిది.

## కరీంనగర్ కళాకారుల బోనాల జాతరకు సహకరించిన కొత్త జయపాల్ రెడ్డి గారికి కళాకారుల సన్మానంలి



**కరీంనగర్:** కరీంనగర్ కళాకారుల బోనాల జాతర కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన మైత్రి గ్రూప్స్ అధినేత శ్రీ కొత్త జయపాల్ రెడ్డి గారిని కళాకారులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సంధ, స్వప్న, గోగుల ప్రసాద్, తమ్మిశెట్టి సంతోష్, కొత్తకొండ అభినవ్, తిప్పబత్తిని రవి తదితర కళాకారులు జయపాలన్న గారికి కృతజ్ఞతలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. కళల అభివృద్ధికి, కళాకారుల సంక్షేమానికి జ యపాలన్న గారు చేస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్ర మంలో కళాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ను బలోపేతం చేద్దాం



**ఎలిగేడు, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామ, గ్రామాన ఎమ్మార్పీఎస్ కమిటీలను ఏర్పాటు చేసి బలోపేతం చేయాలని జిల్లా ఇంచార్జ్ చెన్నూరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండల ఇంచార్జ్ తిప్పరావు లక్ష్మణ్ మాదిగ, బాసంపల్లి వినోద్, న్యాతరి పోచయ్య ఆధ్వర్యంలో సోమవారం ఎలిగేడు మండల ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పీ, అనుబంధ సంఘాల అత్యవసర సమావేశం జరిగింది.ఈ సందర్భంగా చెన్నూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, "ఎలిగేడు మండలంలోని గ్రామాల్లో కొత్త కమిటీలను ఏర్పాటు చేసి, మండల కమిటీ ఎండాగద్దెల నిర్మాణాలు చేపట్టాలి. సెప్టెంబర్ 9న వరంగల్‌లో జరిగే జాతీయ కార్యవర్గ సమావేశానికి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలి" అని పిలుపునిచ్చారు.ఈ సమావే శంలో సీనియర్ నాయకులు అంబాల రాజేం దర్ మాదిగ, న్యాతరి పోచాలు, జల్లి రమేశ్ మాదిగ, ఇరుగురాల సదానందం మాదిగ, ఊట్ల నర్సయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## చర్మానికి, శిరోజాలకు ఎంతో మేలు చేసే రైస్ బ్రాన్ ఆయిల్.. ఎలా ఉపయోగించాలంటే..



చర్మం, జుట్టు సంరక్షణ కోసం సహజ నూనెలను ఉపయోగించడం ఇటీవలి కాలంలో బాగా ప్రాచుర్యం పొందింది. చర్మాన్ని మృదువుగా, కాంతివంతంగా, తేమగా ఉంచడంలో కొన్ని సహజ నూనెలు ఉపయోగపడతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. వంటల్లో, సలాడ్ డ్రెస్సింగ్‌గా ఉపయోగించే రైస్ బ్రాన్ ఆయిల్ కూడా చర్మం, జుట్టు సంరక్షణలో ఉపయోగపడే నూనెల్లో ఒకటిగా పేర్కొంటున్నారు. ఇందులో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. బియ్యం గింజపై ఉండే బయటి పొరను రైస్ బ్రాన్ అంటారు. ఈ పొర నుంచి తీసే నూనెనే రైస్ బ్రాన్ ఆయిల్‌గా పిలుస్తారు. ఇందులో పాలీ అన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్లు, ఫ్లేవనాయిడ్లు వంటి పదార్థాలు ఉంటాయి. ఇవి చర్మం, జుట్టు ఆరోగ్యానికి ఉపయోగపడతాయి.తలకు మృదువుగా మసాజ్ చేస్తే..రైస్ బ్రాన్ ఆయిల్‌లో ఒమెగా 3, ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు ఉండటంతో జుట్టుకు పోషణ అందించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా చిట్లిపోయే లేదా గజిబిజిగా ఉండే జుట్టుకు ఈ నూనె ఉపయోగపడుతుంది. జుట్టు కడగడానికి ముందు రైస్ బ్రాన్ ఆయిల్‌తో తలకు మృదువుగా మసాజ్ చేయడం వల్ల హెయిర్ ఫోలికల్స్ ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడతాయి. ఎండలోని అల్ట్రావయొలెట్ కిరణాల వల్ల చర్మం దెబ్బతినే అవకాశం ఉంటుంది. రైస్ బ్రాన్ ఆయిల్‌ను చర్మంపై మృదువుగా మసాజ్ చేయడం వల్ల సూర్యకిరణాలు, కాలుష్యం వల్ల కలిగే ప్రభావాలను కొంతవరకు తగ్గించడంలో సహాయపడుతుంది. అయితే దీన్ని సహజమైన సన్‌స్క్రీన్‌గా ఉపయోగించవచ్చు. సూర్యరశ్మి నుంచి రక్షణ కోసం ప్రత్యేక సన్‌స్క్రీన్‌కు ఇది ప్రత్యామ్నాయం అని మాత్రం భావించకూడదు.
మేకప్‌ను తీసేందుకు..రైస్ బ్రాన్ ఆయిల్‌లో ఉండే సహజ యాంటీ ఆక్సిడెంట్లు మేకప్‌ను తొలగించడంలో కూడా సహాయపడతాయి. ఇందులో ఉండే విటమిన్ ఇ చర్మంలోని పొరల్లోకి చొచ్చుకుపోయే లక్షణాన్ని కలిగి ఉండటంతో, మేకప్ తొలగించిన తర్వాత చర్మం మృదువుగా, తేమగా ఉండేందుకు ఉపయోగపడుతుంది. ఈ నూనెలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మానికి పోషణను అందించడంతోపాటు చర్మాన్ని యవ్వనంగా ఉంచడంలో సహాయపడతాయి. అలాగే జుట్టు త్వరగా తెల్లబడే ప్రక్రియను ఆలస్యం చేయడంలోనూ రైస్ బ్రాన్ ఆయిల్ ఉపయోగపడుతుంది. గోరువెచ్చని రైస్ బ్రాన్ ఆయిల్‌తో వారానికి రెండుసార్లు జుట్టుకు మసాజ్ చేయడం, షాంపూలో రెండు మూడు చుక్కల నూనె కలపడం వల్ల ప్రయోజనం పొందవచ్చు.కళ్ల సమస్యలకు..కళ్ల కింద నల్లని వలయాలు, ఉబ్బినట్లు కనిపించే కళ్ల సమస్యతో బాధపడేవారికి కూడా రైస్ బ్రాన్ ఆయిల్ ఉపయోగపడుతుంది. కళ్ల చుట్టూ రక్త ప్రసరణను మెరుగుపరచడంలో ఇది సహాయపడుతుంది. నూనెలో అధికంగా ఉండే స్టెరాల్స్ కళ్ల కింద చర్మాన్ని కాంతివంతంగా మార్చడంలో, డార్క్ సర్కిల్స్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. అయితే చర్మం లేదా జుట్టుపై ఏదైనా సహజ నూనెను ఉపయోగించే ముందు, ముఖ్యంగా సున్నితమైన చర్మం ఉన్నవారు, చిన్న ప్రాంతంలో పరీక్షించి చూడటం మంచిది. ఏదైనా అలర్జీ లేదా చర్మ సమస్య కనిపిస్తే ఉపయోగించడం ఆపి నిపుణులను సంప్రదించడం అవసరం.

## ఎలిగేడు పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన డీసీపీ





**ఎలిగేడు, ఆగస్టు 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి డీసీపీ బూక్య రామ్‌రెడ్డి సోమవారం ఎలిగేడు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.స్టేషన్‌లోని క్రైమ్ రికార్డులు, సీసీటీఎన్ఎస్, ఈ సాక్ష్య, స్టేషన్ హౌస్ మేనేజ్మెంట్ సిస్టమ్ వంటి సాంకేతిక విభాగాల పనితీరును సమీక్షించారు. పోలీసు సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు."విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేస్తూ పోలీస్ శాఖకు మంచి గుర్తింపు తీసుకురావాలి. స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులను వెంటనే స్వీకరించి వేగంగా పరిష్కరించాలి" అని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు, ఎలిగేడు ఎస్సై మధుకర్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజ్యాంగ విలువలే మా ప్రాధాన్యం

హైదరాబాద్ :హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక నేషనల్ అకాడమీ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ (నల్సార్) విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, వర్సిటీ అధికారుల మధ్య వివాదం చెలరేగింది. రానున్న స్నాతకోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా భారత ప్రధానన్యా యమూర్తి సూర్యకాంత్‌ను ఆహ్వానించాలన్న వర్సిటీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పలువురు విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ మేరకు వివిధ బ్యాచ్‌లకు చెందిన సుమారు 350 నుంచి 450 మంది విద్యార్థులు వర్సిటీ పరిపాలనా విభాగానికి ఆరు వేర్వేరు వినతిపత్రాలను సమర్పించారు. రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండేలా ఈ ఆహ్వానాన్ని పునఃపరిశీలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఇటీవల కాక్రోజ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో యువత చలో సంసద్ ఆందోళన చేపట్టగా.. నిరసనకారులపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. పోలీసుల దౌర్జన్యం, అణచివేతకు సంబంధించిన ఆరోపణల విచారణ సందర్భంగా సీజేఐ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని విద్యార్థులు తమ లేఖల్లో పేర్కొన్నారు. 'మాకు వీడియోల పట్ల ఆసక్తి లేదు.. చూసేందుకు మాకు సమయం లేదు.. మా సమయాన్ని వృథా చేయవద్దుట అంటూ న్యాయస్థానంలో ఆయన చేసిన వ్యాఖ్యలు బాధ్యతాయుతంగా లేవని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడాల్సిన అత్యున్నత న్యాయస్థానం నుంచి ఇలాంటి స్పందన రావడం తీవ్ర నిరాశను కలిగించిందని వారు అభిప్రాయపడ్డారు. సాధారణంగా ప్రతి ఏటా నల్సార్ స్నాతకోత్సవానికి భారత






ప్రధానన్యాయమూర్తిని ముఖ్య అతిథిగా ఆహ్వానించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే, విశ్వవిద్యాలయం తమకు నేర్పిన రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, హక్కుల పరిరక్షణ వంటి అంశాలకు ఈ ఆహ్వానం విరుద్ధంగా ఉందని విద్యార్థులు వాదిస్తున్నారు. 'ఒక విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం అనేది కేవలం డిగ్రీలను ప్రదానం చేసే వేడుక మాత్రమే కాదు. అది సంస్థ నమ్మే విలువలకు అద్దం పట్టాలి. పోలీసుల దౌర్జన్యాలను తేలికగా తీసుకునే ప్రముఖుల చేతుల మీదుగా పట్టాలు అందుకోవడం మా విద్యార్థి లోకానికి ఇబ్బందికరంగా ఉంది' అని విద్యార్థులు తమ లేఖల్లో స్పష్టం చేశారు. జెన్- జీ నిరసనలపై =ూా చీఫ్ సంచలన వ్యాఖ్యలుఈ విషయమై జూలై 23న తొలి వినతిపత్రాన్ని వైస్-ఛాన్సలర్, రిజిస్ట్రార్, ప్రొఫెసర్లకు సమర్పించగా.. దానికి మద్దతుగా మరో ఐదు బ్యాచ్‌ల విద్యార్థులు వరుస లేఖలను అందించారు. అయితే, విద్యార్థుల నుంచి ఇంత పెద్ద ఎత్తున వినతిపత్రాలు వెల్లువెత్తినప్పటికీ వర్సిటీ యంత్రాంగం నుంచి ఇంతవరకు ఎటువంటి అధికారిక స్పందన రాలేదు. వైస్-ఛాన్సలర్ శ్రీకృష్ణ దేవ రావును సంప్రదించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మరోవైపు.. రిజిస్ట్రార్ మాత్రం తనకు ఈ వినతిపత్రాల గమనార్హం. తాము సీజేఐ పదవిని ఎంతో గౌరవిస్తామని, కానీ నల్సార్‌లో తాము నేర్చుకున్న రాజ్యాంగ స్ఫూర్తికి భంగం కలిగించే అంశాలను మాత్రం సమర్థించలేమని స్టూడెంట్ బార్ కౌన్సిల్ ప్రతినిధులు తేల్చిచెప్పారు. ఈ అంశంపై వర్సిటీ అధికారులు సానుకూలంగా స్పందించి, విద్యార్థి ప్రతినిధులతో చర్చలు జరిపి తగిన నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇలా విద్యార్థులు, యాజమాన్యం మధ్య నెలకొన్న ఈ ఘర్షణ వాతావరణం ప్రస్తుతం సర్వత్రా చర్చనీయాంశమైంది.

# ప్రియాంక కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుంది



హైదరాబాద్, ఆగస్టు 10 : వైద్య విద్యార్థిని ప్రియాంక మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి హెచ్చరించారు. గాంధీ ఆస్పత్రిలోని మార్చురీలో ప్రియాంక భౌతికకాయాన్ని మంత్రి వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమా ర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమెకు నివాళులు అర్పించారు. ప్రియాంక తండ్రిని వారు ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ప్రియాంక ఘటన అత్యంత దని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి తమకు, అధికారులకు ప్రియాంక కుటుంబాన్ని పరామర్శించాలని ఆదేశాలు ఇచ్చారని మంత్రి అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన నిర్ణయాలు తీసుకోవడం అవసరమని చెప్పుకొచ్చారు. ప్రియాంక కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చట్టాల్లో ఉన్న లొసుగులను ఆసరా చేసుకొని నిందితులు తప్పించుకోకుండా కఠినతరం చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ సర్కార్‌పై పొంగులేటి అబద్ధాలు



హైదరాబాద్, ఆగస్టు 10 కాంగ్రెస్ సర్కార్ అలవికాని హామీలిచ్చి అమలు చేయలేక గత ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ కాలమెల్లదీస్తుందని ప్రత్యేకించి చెప్పనసరం లేదు. కాంగ్రెస్ సర్కార్ పనితీరు ఎలా ఉందో తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన కామెంట్స్ మరోసారి చెప్పకనే చెబుతున్నాయి. కమలాపూర్ మండలంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వం తరపున ఇంకా కొన్ని కార్యక్రమాలు చేయాల్సి ఉంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఆనాటి ప్రభుత్వం కొల్లగొట్టిన కారణంగా అనుకున్నన్నీ ఇంకా పూర్తిగా ఇవ్వలేదు. తప్పకుండా ఇచ్చి తీరుతామని అన్నారు. దీంతో పక్కన ఉన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కలగజేసుకొని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల గురించి అబద్ధాలు చెప్తున్నారంటూ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై కౌశిక్ రెడ్డి ఫైర్ అయ్యారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వర్సెస్ కౌశిక్ రెడ్డి అప్పుల పేరుతో కాంగ్రెస్ తప్పించుకునే డ్రామాలు ఆపాలని పొంగులేటితో సభా వేదికపైనే కౌశిక్ రెడ్డి వాగ్వాదానికి దిగారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.

# హర్ ఘర్ తిరంగా' అభియాన్‌లో ప్రతి భారతీయుడు భాగస్వామి కావాలి

హైదరాబాద్, ఆగస్టు 10 : ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచించారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ కార్యక్రమాన్ని రాష్ట్రమంతా విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా బీజేపీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా అభియాన్' కార్యక్రమాన్ని పురస్కరించుకుని బండి సంజయ్ హైదరాబాద్‌లోని తన నివాసం వద్ద జాతీయ జెండాను ఈరోజు (సోమవారం) ఎగురవేశారు. అనంతరం పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మీడియాకు బండి సంజయ్ ఒక ప్రకటన విడుదల చేశారు.'తిరంగా యాత్ర'లను విజయవంతంగా నిర్వహించాలి..దేశవ్యాప్తంగా



'హర్ ఘర్ తిరంగా' అభియాన్ కార్యక్రమాలను చేపడుతున్నట్లు బండి సంజయ్ వ్యాఖ్యానిం చారు. నుంచి 'హర్ ఘర్ తిరంగా అభియాన్' కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో 'తిరంగా యాత్ర'లను విజయవంతంగా నిర్వహించాలని బీజేపీ శ్రేణులను బండి సంజయ్ కో రారు. కుల, మత, వర్గాలకు అతీతంగా ప్రతి భారతీయుడు, విద్యార్థులు పెద్దఎత్తున భాగస్వా మ్యమై స్వచ్ఛందంగా తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరిం చుకుంటూ దేశంపై తమకున్న భక్తిభావాన్ని చాటుకోవడానికి ఇది సువర్ణావకాశమని పేర్కొన్నారు .స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుద్ధి చేయాలి..స్వాతంత్ర్య దినోత్సవానికి ముందుగా, ఆగస్టు 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు మహాపురుషులు, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుద్ధి చేసి, స్మారక చిహ్నాల చుట్టూ ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ శ్రేణులను బండి సంజయ్ కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి కూడలిలో తిరంగా ర్యాలీలు, దేశభక్తి ప్రదర్శనలు, ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రతి పౌరుడిని మానసికంగా దేశంతో అనుసంధా నించే ఒక గొప్ప సామాజిక ఉద్యమంగా ఈ కార్యక్రమం రూపాంతరం చెందిందని తెలిపారు. ప్రతి ఏడాది ఇది ఘనంగా జరుగుతోందని గుర్తుచేశారు. 'మన జాతీయ త్రివర్ణ పతాకం దేశ ప్రజలందరి ఐక్యతకు, సమైక్యతకు, అఖండతకు ప్రతీక అని వెల్లడించారు. ప్రతి ఇంటా దేశభక్తి వాతావరణం పరిమళించేలా ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా చూసి 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌ను విజయవంతం చేయాలని బండి సంజయ్ కోరారు.

# గాంధీలో ఆధునిక హార్ట్ లంగ్ మిషన్ అందుబాటులోకి - రూ. లక్షల్లో ఖర్చయ్యే చికిత్స ఇకపై ఉచితం

హైదరాబాద్, ఆగస్టు 10 పేదలకు ప్రభుత్వ ఆసుపత్రులే దేవాలయల్లాం టివి. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి చూపించ్ుకునే స్థోమత లేక సర్కారు దవాఖాన్లనే నము ్మకుని బతుకుతుంటారు. నొప్పి, రోగం ఏం వచ్చినా అక్కడికే వెళ్తారు. ఈ క్రమంలో వారికేదైన పెద్దరోగం వచ్చిందంటే చాలు ఇక ఆశలు వదులుకుంటారు. ఎందుకంటే రూ. లక్షలు ఖర్చు చేసేంత డబ్బు వారి దగ్గర ఉండదు. కొన్ని జబ్బులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా నయం చేసేందుకు వీలుండదు. ఆ జబ్బుకు అందించే చికిత్స ఆధునికతతో కూడుకున్నదై ఉంటుంది. అలాంటి ఆధునిక చికిత్సలు కేవలం ప్రైవేట్? ఆసుపత్రుల్లోనే జరుగుతుంటాయి. అయితే గుండె, ఊపిరితిత్తుల వంటి క్లిష్టమైన శస్త్ర చికిత్సల సమయంలో ఆధునిక హార్ట్ లంగ్ మిషన్ అనేది ఎంతో ముఖ్యమైంది. అయితే ఇందుకు ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ. లక్షలు




ఖర్చు అవుతాయి. దానిని దృష్టిలో పెట్టుకుని పేదలకు ఉచితంగా గాంధీ ఆసుపత్రిలో రూ. 3 కోట్ల విలువైన ఆధునిక హార్ట్ లంగ్ మిషన్ అందుబాటులోకి వచ్చింది. దీంతో రోగులకు సులభంగా వైద్యులు చికిత్సలు షురూ చేశారు. ఈ యంత్రం పేషెంట్లకు సంజీవనిలా పనిచేస్తుంది.రోగుల తాకిడి ఎక్కువే : గాంధీ ఆసుపత్రిలో ప్రతి రోజూ కార్డియాలజీ, కార్డియో థోరాసిక్? ఓపీలకు రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. కొందరు చిన్న పిల్లలకు పుట్టుకతోనే గుండెకు రంధ్రాలు ఉంటడంతో ఆసుపత్రిలో చేరుతారు. అత్యవసరం విభాగం కింద ఎంతో మంది వస్తుంటారు. ఆ సమయంలో రూ.లక్షలు ఖర్చయ్యే ఈ ఆధునిక చికిత్సలు లేకపోవడంతో కొందరు అక్కడే కన్నుమూస్తుంటారు. ఇక నుంచి అలాంటి క్లిష్టమైన పరిస్థితి ఉండదని వైద్యులు అంటున్నారు. ఎంత పెద్ద చికిత్సనైనా ఈ యంత్రం సాయంతో సులభంగా చేయవచ్చని వివరించారు. సర్జరీ సమయంలో మెదడు, మూత్రపిండాలు, కాలేయం వంటి ప్రధాన అవయవాలకు ఆక్సిజన్?ను ఈ యంత్రం ద్వారా అందించవచ్చని అంటున్నారు .ఈ సమస్య ఉన్న రోగులకు ఉపయోగం : సాధారణంగా గుండెకు సంబంధించిన సర్జరీలు ఏవైనా చేసినప్పుడు గుండె కొట్టుకోవడాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తారు. ఆ సమయంలో పేషెంట్?కు రక్తాన్ని సరఫరా చేసేందుకు ఈ యంత్రాన్ని ఉపయోగిస్తారు. ఇది శరీరంలోని చెడు రక్తాన్ని బయటకు తీసి ఆక్సిజనేషన్? చేస్తుంది. ఈ యంత్రంలో ఉండే కృత్రిమ ఊపిరితిత్తులు రక్తంలో నుంచి కార్బన్ డయాక్సైడ్‌ను తొలగిస్తాయి. పంప్ ద్వారా శుద్ధి చేసిన ఆక్సిజన్ ఉన్న రక్తాన్ని శరీరంలోకి పంపి రోగి ప్రాణాలను కాపాడుతుంది. ఊపిరితిత్తులు దెబ్బతిన్నప్పుడు వెంటిలేటర్ కూడా పనిచేయని పరిస్థితిలో రోగికి శ్వాస అందించి సంజీవనిలా పనిచేస్తుంది. గుండె మార్పిడి, ఊపిరితిత్తులు మార్పిడి సమయంలో కూడా ఇదే యంత్రాన్ని ఉపయోగిస్తారు. కొందరు చిన్న పిల్లలు, పెద్దల్లో గుండె రంధ్రాలు (ఏఎస్‌డీ, వీఎస్‌డీ)ను సరిచేసే శస్త్రచికిత్సల్లో దీన్ని వాడతారు.

# కోటి మందికిపైగా స్మార్ట్ రేషన్‌కార్డులు ఇవ్వబోతున్నాం

సంగారెడ్డి, ఆగస్టు 10: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 15న జిల్లాలో పర్యటించనున్నారు. సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను సీఎం పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా ఈరోజు (సోమవారం) తారా డిగ్రీ కాలేజీలో హెలిప్యాడ్, అంబేద్కర్ స్టేడియంలో సభా స్థలిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అరకొరగా రేషన్ కార్డులు ఇచ్చారని విమర్శించారు.



కోటి 5 లక్షల మందికి కాంగ్రెస్ ప్రభుత్వంలో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కమిట్‌మెంట్‌తో పని చేస్తోందని జగ్గారెడ్డి తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షించదగిన విషయమన్నారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమైనా కాంగ్రెస్ పార్టీ తరపున సీఎం రేవంత్‌కు ఘనంగా స్వాగతం పలుకుతామని చెప్పారు. సభని 50 వేల మందితో నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతాం

వరంగల్ జిల్లా : ఎంతకాలం బతికినం అనేది కాదు.. ఎట్లా బతికినం అనేది ముఖ్యం : అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభకు హరీశ్ రావుతో కలిసి హాజరయ్యారు. పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రకు వేలాది మంది తరలివచ్చారు.లక్షకు పైగా మంది 12 గంటల పాటు వర్షం పడుతున్నా ఎక్కడికి వెళ్లకుండా అంతిమయాత్రలో పాల్గొన్నారుఆయన ఎలాంటి వ్యక్తో తెలుపడానికి ఇదే నిదర్శమన్నారు. పెద్ది కోరుకున్నట్లు వచ్చే రెండేండ్లలో అధికారంలోకి వస్తామన్నారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సంపేటలోని మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతామన్నారు. భవిష్యత్ తరాలు గుర్తు చేసుకునే విధంగా ఘన నివాళులు అర్పిద్దామన్నారు.



# సాగునీటి కోసం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాసిన హరీశ్ రావు

హైదరాబాద్, ఆగస్టు 10 తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేసి రైతుల ఇబ్బందులు తొలగించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీశ్ రావు లేఖ రాశారు. రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నింపకపోవడం వల్ల పంటలు సాగు కాక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆందేళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాల్లో ఉన్న అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లను నింపి, సుమారు 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందాలని,




దానికోసం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మిడ్ మానేరు నుంచి మోటర్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఎల్‌నినో వల్ల తక్కువ వర్షపాతం, మరోవైపు ప్రాజెక్టుల్లో నీళ్లు లేక రైతులు ఆందోళనలో ఉన్నారు. వానాకాలం పంట సాగుకు సాగునీటి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అదేవిధంగా లోయర్ మానేరు డ్యామ్ (ాపీణ) పూర్తి నీటి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 6.9 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉందన్నారు. మిడ్ మానేరు నుంచి లోయర్ మానేరుకు నీటిని నింపి ా=ూా ూాూా+జు-2లోని ఆయకట్టుకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని లేఖలో కోరారు. గత యాసంగి పంటలో కాళేశ్వరం ప్రాజెక్టులోని రిజర్వాయర్ల ఆయకట్టు పరిధిలో 4 లక్షల ఎకరాలు సాగైన విషయం గుర్తించి, ఈ వానాకాలం పంటకు, అదేవిధంగా వచ్చే యాసంగి పంటకు కూడా సాగునీరు అందేలా కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగంలోని అన్ని రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు.

RNI - TELTEL/2023/87644

# ఐపీఎల్ ట్రేడింగ్‌లో హార్దిక్ పాండ్యా హవా..

ఐపీఎల్ ట్రేడింగ్ విండోలో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా పేరు మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ నుంచి పాండ్యాను తమ జట్టులోకి తీసుకునేందుకు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే), కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. లక్నో సూపర్ జెయింట్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లు కూడా ఆసక్తిగా ఉన్నప్పటికీ, ఇప్పటివరకు పెద్దగా చర్చలు జరగలేదట. గుజరాత్ టైటాన్స్ జట్టును మొదటి సీజన్లోనే విజేతగా, రెండో సీజన్లో రన్నరప్‌గా నిలబెట్టిన హార్దిక్ పాండ్యా, ముంబై ఇండియన్స్‌లో మాత్రం స్థిరమైన ప్రదర్శన ఇవ్వలేకపోయాడు. మూడు సీజన్లలో ఒకేసారి ప్లే ఆఫ్స్ చేరాడు. కానీ ఫాస్ట్ బౌలింగ్ చేయగల ఆల్‌రౌండర్‌గా, టీమ్‌కు మంచి బ్యాలెన్స్ తెచ్చే లీడర్‌గా ఐపీఎల్‌లో అతడికి మంచి డిమాండ్ ఉంది. అందుకే ఫ్రాంచైజీలు హార్దిక్ కోసం పోటీ పడుతున్నాయి. ముంబై ఒకవేళ ట్రేడింగ్ చేసే యోచనలో ఉంటే, ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెందిన అక్షర్ పటేల్‌తో స్వ్యాప్ చేసుకోవచ్చనే చర్చ సాగుతోంది. అక్షర్ రాకతో ముంబై స్పిన్ విభాగం బలపడటమే కాకుండా విదేశీ ఆల్‌రౌండర్లపై ఆధారపడటం తగ్గుతుంది. అయితే, తమ స్టార్ ఆల్‌రౌండర్‌కు ప్రతిఫలంగా అగ్రశ్రేణి భారతీయ బ్యాటర్ లేదా బౌలర్‌ను మాత్రమే కోరాలని ముంబై భావిస్తోంది. కేకేఆర్ ఫ్రాంచైజీ కామెరూన్ గ్రీన్‌ను ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది. కానీ రాబోయే యాషెస్ సిరీస్ దృష్ట్యా అతని లభ్యతపై అనుమానాలు ఉండటంతో ముంబై సుముఖంగా లేదు. అటు సీఎస్కే విషయానికొస్తే, నూతన ఓవర్సీస్ కోచ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాతే హార్దిక్ పాండ్యా ట్రేడ్‌పై నిర్ణయం తీసుకుంటామని సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ స్పష్టం చేశారు.



ఐపీఎల్‌లో ఒక ఆనవాయితీ ఉంది, అదేంటంటే -- ట్రేడింగ్ ద్వారా ప్రత్యర్థి జట్లను బలంగా మార్చకూడదు. పాండ్యా ఫామ్ అంత గొప్పగా ఏమీ లేనప్పటికీ, అతడు వేరే జట్టులోకి వెళ్తే ఆ జట్టు అత్యంత ప్రమాదకరంగా మారుతుందని ముంబై ఇండియన్స్‌కు తెలుసు. అందుకే వేరే జట్టును బలోపేతం చేసే కంటే, తమ జట్టుకు గరిష్ట ప్రయోజనం చేకూరే ప్రతిపాదన వస్తేనే పాండ్యాను వదులుకోవాలని ముంబై భావిస్తోంది. ప్రస్తుతం బెంగళూరులోని సీఓఈలో ఫిట్‌నెస్ సాధిస్తున్న హార్దిక్, తన భవిష్యత్తుపై ముంబై నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాడు!

# వామప్ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం..



## భారత్ 6 వికెట్ల తేడాతో శ్రీలంకపై గెలుపు

శ్రీలంక పర్యటన భారత్ ఘనంగా ప్రారంభించింది. రెండు టెస్ట్‌ల సిరీస్‌కు సన్నాహకంగా శ్రీలంక ఎలెవన్‌తో జరిగిన మూడు రోజుల వామప్ మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో టెయిలెండర్ మహమ్మద్ సిరాజ్(15 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 32 నాటౌట్) అద్వితీయమైన బ్యాటింగ్‌తో చిరస్మరణీయమైన విజయాన్ని అందుకుంది. 207 పరుగుల లక్ష్య ఛేదనలో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన భారత్ నిర్ణీత 45 ఓవర్లలో 4 వికెట్లకు 214 పరుగులు చేసి గెలుపొందింది. యశస్వి జైస్వాల్(46 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 61 రిటైర్డ్ హర్ట్) హాఫ్ సెంచరీతో రాణించగా.. శుభ్‌మన్ గిల్(54 బంతుల్లో 7 ఫోర్లతో 44), మహమ్మద్ సిరాజ్(15 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 32 నాటౌట్) విలువైన పరుగులు చేశారు. శ్రీలంక బౌలర్లలో కేశర నువాంత(2/57) రెండు వికెట్లు తీయగా.. విశ్వ ఫెర్నాండో, రమేష్ మెండీస్ తలో వికెట్ తీసారు. భారత్ విజయానికి ఆఖరి 6 బంతుల్లో 16 పరుగులు అవసరమయ్యాయి. క్రీజులో టెయిలెండర్ మహమ్మద్ సిరాజ్‌తో పాటు సరాన్ష్ జైన్ ఉండటంతో విజయం కష్టమేనని అంతా అనుకున్నారు. కానీ సిరాజ్ అనూహ్యంగా హ్యాట్రిక్ సిక్స్‌లు బాది విజయాన్ని అందించాడు. శ్రీలంక ఎలెవన్ ప్రధాన బౌలర్ కేశర నువాంత్ వేసిన ఆఖరి ఓవర్‌లో వరుసగా మూడు బంతులను సిక్స్‌లు బాది భారత్ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. ఈ విజయం భారత్ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. ఈ మూడు రోజుల వామప్ మ్యాచ్ ద్వారా భారత ఆటగాళ్లకు కావాల్సిన ప్రాక్టీస్ లభించింది.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక ఎలెవన్ తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్లకు 363 పరుగులు చేసింది. నిషాన్ ఫెర్నాండో(65 బంతుల్లో 11 ఫోర్లు, సిక్స్‌తో 66), రావిందు రసంతా(143 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 71), కెప్టెన్ సోనాల్ దినుషా(72 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 52) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా(2/64), కుల్దీప్ యాదవ్(2/76), మానవ్ సుతార్(2/33) రెండేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, యువ బౌలర్ సరాన్ష్ జైన్ ఒక్క వికెట్ తీయలేకపోయారు. అనంతర భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 90 ఓవర్లలో 6 వికెట్లకు 357 పరుగుల వద్ద డిక్లేర్డ్ చేసింది. దేవదత్ పడిక్కల్(164 బంతుల్లో 18 ఫోర్లతో 142 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగగా.. రవీంద్ర జడేజా(117 బంతుల్లో 7 ఫోర్లతో 63) హాఫ్ సెంచరీతో రాణించాడు. మానవ్ సుతార్(90 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 41), సరాన్ష్ జైన్(22), గుర్నూర్ బ్రార్(17 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 36 నాటౌట్) విలువైన పరుగులు చేశారు.శ్రీలంక ఎలెవన్ బౌలర్లలో రమేష్ మెండీస్, అసంక మనోజ్ రెండేసి వికెట్లు తీయగా.. విశ్వ ఫెర్నాండో, కేశర నువాంత తలో వికెట్ తీసారు. శ్రీలంక ఎలెవన్ రెండో ఇన్నింగ్స్‌లో 45 ఓవర్లలో 6 వికెట్లకు 200 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. నిషాన్ ఫెర్నాండో(73 బంతుల్లో 10 ఫోర్లతో 63), నిపున్ ధనంజయ(56 బంతుల్లో 5 ఫోర్లతో 46), అంజల బండార(48 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 35) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ తలో వికెట్ తీయగా.. గుర్నూర్ బ్రార్(2/37), రవీంద్ర జడేజా(2/33) రెండేసి వికెట్లు తీసారు. దాంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకొని భారత్ ముందు 207 పరుగుల లక్ష్యం నమోదైంది.

# కింగ్ కోహ్లీ ఓ మిస్టరీ బౌలర్

## • స్టార్ క్రికెటర్ మార్కస్ స్టోయినీస్



ఛేజ్ మాస్టర్, రన్ మెషీన్, టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన స్టార్ బ్యాటర్ అని అందరికీ తెలిసిన విషయమే. కానీ ఆస్ట్రేలియా ఆల్ రౌండర్, పంజాబ్ కింగ్స్ స్టార్ క్రికెటర్ మార్కస్ స్టోయినీస్ తన బ్యాక్‌యార్డ్ క్రికెట్ (పరదాల మధ్య సరదాగా ఆడే క్రికెట్) జట్టు కోసం టీమిండియా దిగ్గజం విరాట్ కోహ్లీని ఓ బౌలర్‌గా సెలెక్ట్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. విరాట్ కోహ్లీని ప్రపంచమంతా గొప్ప బ్యాటర్‌గా భావిస్తుంటే.. మార్కస్ స్టోయినీస్ మాత్రం అతడిని బౌలర్‌గా ఎంచుకోవడం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. స్టార్ స్పోర్ట్స్ యూట్యూబ్ ఛానెల్లో మార్కస్ స్టోయినీస్ ఈ ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నాడు. బ్యాక్‌యార్డ్ క్రికెట్లో విరాట్ కోహ్లీ వేసే పార్ట్-టైమ్ బౌలింగ్ అత్యంత విచిత్రంగా, బ్యాటర్లకు అర్థం కాని విధంగా ఉంటుందని స్టోయినీస్ పేర్కొన్నాడు. విరాట్ కోహ్లీ బౌలింగ్ స్టైల్ సాధారణంగా మిగతా బ్యాటర్లకు పెద్దగా పరిచయం ఉండదు కాబట్టి.. కోహ్లీ ఓ మిస్టరీ బౌలర్‌గా ప్రత్యర్థులను బోల్తా కొట్టించగలడని స్టోయినీస్ సరదాగా వివరించాడు. విరాట్ కోహ్లీ తన కెరీర్ ప్రారంభంలో భారత్ తరపున, ఐపీఎల్ లో ఆర్సీబీ తరపున అప్పుడప్పుడు బౌలింగ్ చేసేవాడు. విరాట్ కోహ్లీ అంతర్జాతీయంగా టీ20ల్లో 4 వికెట్లు, వన్డేల్లో 5 వికెట్లు పడగొట్టాడు. టెస్టుల్లో మాత్రం విరాట్ కోహ్లీకి వికెట్ దక్కలేదు. ఐపీఎల్‌లో ఆర్సీబీ తరపున విరాట్ కోహ్లీ ఇప్పటివరకు 4 వికెట్లు తీశాడు. 2016లో గుజరాత్ లయన్స్ జట్టుపై 25 పరుగులిచ్చి 2 వికెట్లు తీయడం కోహ్లీ బెస్ట్ బౌలింగ్ గణాంకాలు కావడం గమనార్హం. చివరగా విరాట్ కోహ్లీ భారత్ తరపున 2023 వన్డే ప్రపంచ కప్ లో నెదర్లాండ్స్ తో జరిగిన మ్యాచ్ లో బౌలింగ్ చేశాడు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఆ మ్యాచ్‌లో డచ్ కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ ను ఔట్ చేసి దాదాపు 9 ఏళ్ల తర్వాత వన్డేల్లో వికెట్ సాధించాడు. అంతేకాకుండా తన హోమ్ టీమ్ ఢిల్లీ తరపున ఫస్ట్ క్లాస్ క్రికెట్లో 3 వికెట్లు, లిస్ట్-ఏ క్రికెట్లో 5 వికెట్లు పడగొట్టాడు. టెస్టులు, టీ20ల నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్ కోహ్లీ.. ప్రస్తుతం వన్డేలు, ఐపీఎల్ లో మాత్రమే కొనసాగుతున్నాడు. రాబోయే వెస్టిండీస్ తో స్వదేశంలో జరగబోయే వన్డే సిరీస్ లో విరాట్ కోహ్లీ తిరిగి భారత జట్టు తరపున మైదానంలోకి దిగే అవకాశాలు ఉన్నాయి.

# టోబీ అల్బర్ట్ సిక్సర్ల విధ్వంసం



ఇంగ్లాండ్‌లో జరుగుతున్న మెట్రో బ్యాంక్ వన్డే కప్‌లో హాంప్‌షైర్ బ్యాటర్ టోబీ అల్బర్ట్ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో సంచలనం సృష్టించాడు. మైదానంలో నాన్‌స్టాప్‌గా విరుచుకుపడిన అతను వరుసగా 6 బంతుల్లో 6 సిక్సర్లు బాది క్రికెట్ ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకున్నాడు. 21 పరుగుల వద్ద క్యాచ్ డ్రాప్ అయి లభించిన అవకాశాన్ని చక్కగా ఉపయోగించుకుని కేవలం 37 బంతుల్లోనే 86 పరుగుల నాటౌట్ ఇన్నింగ్స్ ఆడి హాంప్‌షైర్ జట్టుకు భారీ స్కోరు అందించాడు.క్రికెట్ చరిత్రలో హర్షెల్ గిబ్స్ (2007 వన్డే వరల్డ్ కప్), యువరాజ్ సింగ్ (2007 టీ20 వరల్డ్ కప్) ఒకే ఓవర్లో 6 సిక్సర్లు కొట్టి రికార్డు సృష్టించారు. అయితే టోబీ అల్బర్ట్ రికార్డు కాస్త భిన్నమైనది. ఇతను ఒకే ఓవర్లో కాకుండా రెండు వేర్వేరు ఓవర్లలో కలిపి ఈ వరుస 6 సిక్సర్ల ఘనతను సాధించాడు. మొదట నాంటెస్ ఓస్టుయిజెన్ వేసిన ఓవర్ చివరి రెండు బంతులను సిక్సర్లుగా మలిచాడు. ఆ తర్వాత ఓలీ కిర్టీ వేసిన తదుపరి ఓవర్లోని చివరి 4 బంతులను వరుసగా సిక్సర్లుగా మలచి వరుసగా 6 బంతుల్లో 6 సిక్సర్ల మార్కును అందుకున్నాడు. టోబీ అల్బర్ట్ 21 పరుగుల వద్ద ఉన్నప్పుడు ససెక్స్ ఫీల్డర్లు అతనికి ఒక సులువైన క్యాచ్‌ను నేలపాలు చేసి లైఫ్ లైన్ ఇచ్చారు. అక్కడి నుంచి గేర్ మార్చిన టోబీ, మైదానం నలుమూలలా బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 37 బంతుల్లో 8 సిక్సర్లు, 5 ఫోర్ల సాయంతో 86 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచాడు. టోబీ అల్బర్ట్ కంటే ముందు హాంప్‌షైర్ ఓపెనర్లు అలీ ఓర్ (105), బెన్ మేస్ (109) కూడా అద్భుతమైన సెంచరీలతో రాణించారు. ఈ ముగ్గురు బ్యాటర్ల తుఫాను ఇన్నింగ్స్‌ల పుణ్యమా అని హాంప్‌షైర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 383 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. అనంతరం 384 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ససెక్స్ జట్టు, హాంప్‌షైర్ బౌలర్ల ధాటికి తట్టుకోలేక 332 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో హాంప్‌షైర్ జట్టు మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.

# రిషభ్ పంత్ విలక్షణ ప్రవర్తన..



భారత స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ మైదానంలో ఉంటే ఎంటర్‌టైన్‌మెంట్‌కు కొదవ ఉండదు. తన బ్యాటింగ్‌తోనే కాకుండా చేష్టలతోనూ అతడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. తాజాగా శ్రీలంక లెవెన్‌తో జరిగిన వార్మప్ మ్యాచులోనూ అదే జరిగింది. కొలంబో వేదికగా జరిగిన మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌లో పంత్ తన బ్యాటింగ్ శైలితోనే కాక, ఫుట్‌బాల్ నైపుణ్యాలతోనూ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో త్వరగానే పెవిలియన్ చేరిన పంత్, రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం పూర్తి భిన్నమైన వ్యూహంతో మైదానంలోకి అడుగుపెట్టాడు. రెండో ఇన్నింగ్స్ ప్రారంభంలో అత్యంత జాగ్రత్తగా ఆడాడు. ఎంతలా అంటే.. మొదటి 21 బంతుల వరకు పరుగుల ఖాతానే తెరవలేదు. ధాటిగా ఆడే పంత్ ఇలా సుదీర్ఘంగా డిఫెన్స్ ఆడటం చూసి డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సైతం ఆశ్చర్యపోయాడు. అయితే క్రీజులో కుదురుకున్నాక పంత్ తన అసలు రూపాన్ని బయటకు తీశాడు. శ్రీలంక బౌలర్లు కేశవ నువంత, దిలుమ్ సుదీరల బౌలింగ్‌లో విరుచుకుపడుతూ మూడు భారీ సిక్సర్లతో చెలరేగిపోయాడు. పంత్ సిక్సర్ల హోరును అడ్డుకోవడానికి స్పిన్నర్ సుదీర వైడ్ లెగ్ స్టంప్ దిశగా బంతులు వేయడం ప్రారంభించాడు. అయితే ఆ బంతులను వదిలేయకుండా, పంత్ తన కాళ్లతో ఫుట్‌బాల్ ప్లేయర్‌లా బంతిని వెనక్కి తన్నుతూ విన్యాసాలు చేశాడు. పంత్ చేసిన ఈ క్రేజీ పని చూసి మైదానంలోని ఆటగాళ్లతో పాటు ప్రేక్షకులు కూడా నవ్వేశారు. దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఈ వార్మప్ మ్యాచ్‌లో భారత జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించి గాలే టెస్టుకు ముందు మంచి ఆత్మవిశ్వాసాన్ని మూటగట్టుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో బౌలర్లు శ్రమించినప్పటికీ, రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు మెరుపులు మెరిపించారు. ఆగస్టు 15న గాలే వేదికగా భారత్, శ్రీలంక జట్ల మధ్య తొలి టెస్టు జరగనుంది. రెండో టెస్టు ఆగస్టు 23 నుంచి కొలంబోలోని ఎస్ఎస్‌సీ మైదానంలో జరగనుంది.

# కిరణ్ అబ్బవరం 'ఇంద్రపుత్ర'..

## పాన్ ఇండియా స్థాయిలో భారీ మైథలాజికల్ చిత్రం






వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న యువ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళుతున్నారు. ప్రాంతీయ చిత్రాల పరిధిని దాటి పాన్ ఇండియా స్థాయిలో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. ఆయన కథానాయకుడిగా 'ఇంద్రపుత్ర' అనే భారీ మైథలాజికల్ యాక్షన్ ఫాంటసీ చిత్రాన్ని సోమవారం అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇది కిరణ్ కు 15వ చిత్రం.
ప్రముఖ నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్, గతంలో సుధీర్ బాబుతో 'జటాధార' నిర్మించిన ప్రేరణ అరోరా ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. శ్రీకాంత్ పుప్పాల ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు దర్శకత్వం వహించనున్నారు. ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగే యుద్ధం నేపథ్యంలో రాబోయే ఒక సినిమాటిక్ యూనివర్స్‌లో ఇది తొలి భాగంగా ఉంటుందని చిత్రబృందం తెలిపింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ 2026 అక్టోబరులో ప్రారంభం కానుంది. 2027లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.కెరీర్ ఆరంభంలో కొన్ని పరాజయాలు, సోషల్ మీడియాలో ట్రోలింగ్ ఎదుర్కొన్న కిరణ్ అబ్బవరం, ఇటీవల కాలంలో బలంగా పుంజుకున్నారు. 'కా', 'కే రాంప్', 'చెన్నై లవ్ స్టోరీ' వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి ఆయనకు మంచి మార్కెట్‌ను అందించాయి. ఈ విజయాలతో వచ్చిన ఆత్మవిశ్వాసంతోనే ఆయన ఇప్పుడు పాన్ ఇండియా ప్రాజెక్టులపై దృష్టి సారించారు.ప్రస్తుతం కిరణ్ చేతిలో పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులు ఉన్నాయి. తన 13వ చిత్రంగా 'రియాలిటీ' అనే సినిమాను స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. జాయ్ ఫిల్మ్స్ పతాకంపై సుధాకర్ చాగంటి నిర్మిస్తున్న ఈ చిత్రంతో కన్నడ నటి దేవిక భట్ పరిచయమవుతున్నారు. ఈ సినిమాను 2026 డిసెంబరులో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. దీనితో పాటు సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌పై వీర కొగటం దర్శకత్వంలో ఓ క్రైమ్ థ్రిల్లర్‌లో కూడా కిరణ్ నటిస్తున్నారు. వరుస చిత్రాలతో బిజీగా ఉంటూనే, 'ఇంద్రపుత్ర' వంటి భారీ చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో తనదైన ముద్ర వేయాలని కిరణ్ అబ్బవరం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.

# కొడుక్కి రామ్ చరణ్ పేరు..

## అభిమాని ప్రేమకు ఫిదా.. ఇంటికి పిలిచిన చిరంజీవి!




మెగాస్టార్ చిరంజీవి తన అభిమానులను సొంత కుటుంబ సభ్యుల్లా చూస్తారనడానికి మరో సంఘటన నిదర్శనంగా నిలిచింది. ఓ సాధారణ టెక్నీషియన్ చూపిన అభిమానానికి ముగ్ధుడై, అతడి కుటుంబాన్ని ఇంటికి ప్రత్యేకంగా ఆహ్వానించి ఆశ్చర్యపరిచారు. ఈ ఆత్మీయ భేటీలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కూడా పాల్గొనడం విశేషం. ఈ హృద్యమైన ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.వివరాల్లోకి వెళితే.. ప్రస్తుతం చిరంజీవి 'మెగా 158' సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ చిత్రానికి కెమెరా విభాగంలో పనిచేస్తున్న నివాస్ అనే టెక్నీషియన్‌ను చిరంజీవి పలకరించారు. మాటల సందర్భంలో నివాస్ తాను రామ్ చరణ్‌కు వీరాభిమానినని, ఆ అభిమానంతోనే తన కుమారుడికి 'జస్వంత్ రామ్ చరణ్' అని పేరు పెట్టుకున్నానని చిరంజీవితో చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న మెగాస్టార్ ఎంతో సంతోషించి, భావోద్వేగానికి గురయ్యారు.వెంటనే నివాస్‌ను తన కుటుంబంతో సహా ఇంటికి రావాలని ప్రేమగా ఆహ్వానించారు. మెగాస్టార్ పిలుపుతో ఆనందంలో మునిగిపోయిన నివాస్, తన కుటుంబంతో కలిసి ఆయన నివాసానికి వెళ్లారు. అక్కడ వారికి మరో సర్‌ప్రైజ్ ఎదురైంది. చిరంజీవితో పాటు రామ్ చరణ్ కూడా వారిని ఆప్యాయంగా పలకరించి, వారితో సమయం గడిపారు. ముఖ్యంగా చిన్నారి జస్వంత్ రామ్ చరణ్‌తో చరణ్ కాసేపు సరదాగా గడిపారు. అనంతరం నివాస్ కుటుంబంతో కలిసి చిరు, చరణ్ ఫొటోలు దిగారు.ఈ అరుదైన క్షణాలకు సంబంధించిన ఫొటోలు బయటకు రావడంతో మెగా అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ హీరోల గొప్ప మనసును ప్రశంసిస్తూ కామెంట్లు పెడుతున్నారు. ఓ సాధారణ అభిమానికి మెగా ఫ్యామిలీ ఇచ్చిన గౌరవం, వారి మధ్య ఉన్న బంధానికి నిదర్శనమని అంటున్నారు.

# బాబీ దర్శకత్వంలో చిరు చిత్రం..

## గెస్ట్ రోల్‌లో యంగ్ బ్యూటీ?



మెగాస్టార్ చిరంజీవి తన 158వ చిత్రాన్ని దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వంలో చేయనున్న సంగతి తెలిసిందే. 'మెగా 158' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించి ప్రస్తుతం ఫిలింనగర్‌లో ఒక ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో యువ నటి మీనాక్షి చౌదరి ఒక కీలక పాత్రలో నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఈ చిత్రంలోని ఒక పాత్ర కోసం చిత్రబృందం మీనాక్షి చౌదరితో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అయితే, ఆమె ఇందులో కథానాయికగా కాకుండా, ఒక కీలకమైన అతిథి పాత్రలో మాత్రమే కనిపించనున్నారని సమాచారం. ముఖ్యంగా సినిమా ద్వితీయార్థంలో ఆమె పాత్రకు సంబంధించిన సన్నివేశాలు ఉంటాయని తెలుస్తోంది.ప్రస్తుతం ఈ సినిమాలో కథానాయిక ఎవరనే దానిపై అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో అసలు ఈ చిత్రంలో పూర్తిస్థాయి హీరోయిన్ పాత్ర ఉంటుందా? లేదా? అనే అంశంపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎస్ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో సినిమాను విడుదల చేయాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, మీనాక్షి చౌదరి చేరికపై చిత్ర యూనిట్ నుంచి అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.




# ముందు కాల్చి, తర్వాతే మాట్లాడతాం..

## 'స్లమ్‌డాగ్' నుంచి టబు పవర్‌ఫుల్ గ్లింప్స్!

స్టార్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్, ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్లమ్‌డాగ్ – 33 టెంపుల్ రోడ్'. ఈ సినిమాపై మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి, కీలక పాత్ర పోషిస్తున్న సీనియర్ నటి టబు క్యారెక్టర్ గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ వీడియో సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది.ఈ సినిమాలో టబు 'గౌరీ హెగ్డే' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. గ్లింప్స్ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. "భయంలేని, శక్తివంతమైన, ధైర్యవంతురాలు. భారతీయ సినిమా రత్నం టబును గౌరీ హెగ్డేగా పరిచయం చేస్తున్నాం" అని పూరి జగన్నాథ్ పేర్కొన్నారు. విడుదలైన వీడియోలో టబు తన పాత్రలో ఒదిగిపోయారు. కొందరిని కొడుతూ, బెదిరిస్తూ పవర్‌ఫుల్ ఆఫీసర్‌గా కనిపించారు. "మా స్టైల్‌లో మేము ముందు కాల్చి, ఆ తర్వాత మాట్లాడతాం" అంటూ విజయ్ సేతుపతికి ఆమె చెప్పే డైలాగ్ గ్లింప్స్‌కే హైలైట్‌గా నిలిచింది. చివర్లో "గౌరీ హెగ్డే – డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్" అని ఆమె తన హోదాను వెల్లడించడం ఆకట్టుకుంది.
గతేడాది జులైలో ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని చిత్ర వర్గాలు తెలిపాయి. గతంలో విడుదల చేసిన టైటిల్ పోస్టర్‌లో విజయ్ సేతుపతి చేతిలో కత్తి, చుట్టూ డబ్బు కట్టలతో కనిపించి సినిమాపై క్యూరియాసిటీ పెంచారు. ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్.. జేబీ మోషన్ పిక్చర్స్‌తో కలిసి జేబీ నారాయణరావు కొండ్రొల్ల నిర్మిస్తున్నారు.
ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ స్టార్ దునియా విజయ్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. బ్రహ్మాజీ, వీటీవీ గణేష్ వంటి నటులు ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. 'అర్జున్ రెడ్డి' (నేపథ్య సంగీతం), 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలకు సంగీతం అందించిన హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# కపాలిలో హన్సిక ఫస్ట్ లుక్ విడుదల




నారా రోహిత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కపాలి'. పోలీస్ బ్యాక్‌డ్రాప్‌తో సాగే డిఫరెంట్ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను దర్శకుడు రామ్ గన్ని రూపొందిస్తున్నారు. ఇందులో హన్సిక మోత్వాని కథానాయికగా నటిస్తోంది. విభిన్నమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి నెలకొనగా.. తాజాగా హన్సిక పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఆమె ఫస్ట్ లుక్ మరింత క్యూరియాసిటీని పెంచింది. మేకర్స్ విడుదల చేసిన ఫస్ట్ లుక్‌ను ఎంతో క్రియేటివ్‌గా డిజైన్ చేశారు. హన్సిక ముఖాన్ని బ్లాక్ అండ్ వైట్ హ్యాండ్ స్కెచ్ తరహాలో చూపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్, సీరియస్ లుక్ చూస్తుంటే సినిమాలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉన్నట్లు అనిపిస్తోంది. సాధారణమైన దుస్తులతో, మెడలో చిన్న చైన్‌తో కనిపిస్తున్న హన్సిక చూపుల్లో ఏదో తెలియని రహస్యం దాగి ఉన్నట్లుగా పోస్టర్‌ను రూపొందించారు. హన్సిక ముఖంతో పాటు పోస్టర్ బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించే అంశాలు కూడా సినిమా కథపై ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రాచీన కాలానికి చెందినట్లుగా కనిపించే కొన్ని గుర్తులు, వింతైన సింబల్స్ పోస్టర్ చుట్టూ కనిపిస్తున్నాయి. మరోవైపు చీకటి అడవిలో భారీ చెట్ల మధ్య నుంచి సూర్యకాంతి ప్రసరించేలా రూపొందించిన విజువల్ కూడా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా అడవిలో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి నీడ పోస్టర్‌లో మరింత సస్పెన్స్‌ను క్రియేట్ చేస్తోంది. దీంతో 'కపాలి' కేవలం సాధారణ హారర్ కథ కాకుండా.. మిస్టరీ, సైకాలజీ, సస్పెన్స్ అంశాలతో కూడిన డార్క్ థ్రిల్లర్‌గా ఉండబోతుందా అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. సాధారణంగా కనిపించే దెయ్యాలు, భయపెట్టే సన్నివేశాలకే పరిమితం కాకుండా.. అంతుచిక్కని చీకటి ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్లేలా 'కపాలి' కథ ఉండబోతున్నట్లు ఫస్ట్ లుక్ చూస్తే అర్థమవుతోంది. కనిపించని శక్తులు, పురాతన గుర్తులు, మిస్టరీ అంశాల చుట్టూ కథ నడుస్తుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కళ్యాణ చక్రవర్తి మంథినా, భాను కిరణ్ ప్రతాప నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా.. విజయ్ కృష్ణ లింగమనేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. విజువల్‌గా కూడా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది.

# అమెరికా దద్దరిల్లేలా ప్లాన్

## టాక్సిక్ మెగా రిలీజ్!



రాకింగ్ స్టార్ యశ్ నటించిన 'కేజీఎఫ్' ఊచకోత తర్వాత వస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'టాక్సిక్'. ఈ సినిమా కోసం భారతీయ సినీ ప్రేక్షకులు మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ చిత్రం అమెరికాలో మైండ్ బ్లాకయ్యే రేంజ్‌లో భారీ విడుదలకు సిద్ధమవుతోంది. అక్కడ ఏకంగా 2000 పైచిలుకు స్క్రీన్లలో ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు మేకర్స్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక దీంతో ఓవర్సీస్‌లో ఇండియన్ సినిమా చరిత్రలోనే ఇది ఒక సరికొత్త రికార్డుగా నిలవబోతోంది. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ మూవీ అమెరికా థియేటర్లలో సరికొత్త హంగామా సృష్టించబోతోంది. అక్కడి అగ్ర పంపిణీదారులు ఒక భారతీయ సినిమాకు ఈ స్థాయిలో 2,000 కంటే ఎక్కువ స్క్రీన్లు కేటాయించడం చాలా అరుదు. ఇక రాకింగ్ స్టార్ యశ్ కు ఉన్న గ్లోబల్ మేనియాని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 26న విడుదల కానున్న ఈ సినిమా అమెరికా ప్రీమియర్స్ కలెక్షన్లలో పాత రికార్డులన్నింటినీ తుడిచిపెట్టేలా కనిపిస్తోంది. 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' చిత్రాన్ని కేవలం భారతీయ భాషల్లోనే కాకుండా ఇంగ్లీష్‌తో సహా మొత్తం ఆరు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. ఇక కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ భారీ గ్యాంగ్‌స్టర్ థ్రిల్లర్‌లో యష్ నటుడిగానే కాకుండా సహ నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. అధికారం, ద్రోహం, ప్రతీకారం చుట్టూ తిరిగే కథతో వస్తున్న ఈ సినిమా ట్రైలర్ ఇప్పటికే నెట్టింట ట్రెండ్ అవుతూ సినిమాపై అంచనాలను ఆకాశానికి ఎత్తేసింది.